
అనుచరుడికి ఎమ్మెల్యే చిరుకానుక

ఆయనో అధికార పార్టీకి చెందిన మండల స్థాయి ప్రజాప్రతినిధి. ఆయనకు మండల కేంద్రంలో బాగా విలువైన ప్రాంతంలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలంపై కన్ను పడింది. ఎలాగైనా ఈ స్థలాన్ని దక్కించుకోవాలనుకున్న సదరు ప్రజాప్రతినిధి తనకు ఎలాగైనా ఆ స్థలాన్ని ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరాడు అంతే ఎమ్మెల్యే ఆ ప్రజాప్రతినిధికి రూ.6 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని చిరుకానుకగా ఇవ్వాలనుకున్నాడు. ఈ మేరకు ఫైలు సిద్ధం చేయమని తక్షణమే సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఆ స్థలంలో ప్రజల కోసం పార్కును నిర్మిస్తే బాగుంటుందని ఎప్పటి నుంచో అధికారులు, ప్రజాప్రతినిదులు అనుకుంటూ ఉండడంతో అధికారులు ఎమ్మెల్యే చెప్పినట్లు చేయలేకున్నారు. అయితే ఎమ్మెల్యే మాత్రం తాను చెప్పినట్లు ఫైల్ సిద్ధం చేయమని అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయమే మండలంలో చర్చనీయాంశంగా మారింది.


- రూ.6 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సంతర్పణకు యత్నం
- పార్కు నిర్మాణం కోసం వదిలిన స్థలం
- చోటా నాయకుడి పేరుతో ఫైల్ సిద్ధం చేయాలని అధికారులపై ఒత్తిళ్లు
- దిక్కుతోచని స్థితిలో అధికారులు


చోటా ప్రజాప్రతినిధికి ఎమ్మెల్యే కానుకగా ఇవ్వబోతున్న ప్రభుత్వ భూమి



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): చిన్నమండెం గ్రామంలోని సర్వే నెంబరు 184/7లో 2.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది గయాలు భూమిగా ఉంది. కడప-బెంగళూరు జాతీయ రహదారి రోడ్డుకు ఆనుకుని కాకుండా కొంచెం దూరంలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ భూములకు విపరీతమైన ధరలు పలుకుతూ ఉండడంతో ఆ 2.5 ఎకరాల భూమి సుమారు రూ.6 కోట్ల వరకు ధర పలుకుతుంది. అయితే ఓ మోస్తారు పట్టణమైన చిన్నమండెం మండలం కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఇప్పటి వరకు ఎటువంటి పార్కు లేదు. దీంతో గతం నుంచి చాలామంది అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సర్వే నెంబరు 184/7లోని స్థలంలో పార్కును ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని అనుకున్నారు. అయితే ఈనెల మొదటి వారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద స్థానిక ఎమ్మెల్యే చిన్నమండెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ మండల స్థాయి ప్రజాప్రతినిధి మరి కొంతమందితో కలిసి ఎమ్మెల్యేను కలిసినట్లు సమాచారం. ఈ సందర్భంగా తనకు ఆ స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే వెంటనే మండల రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి ఆ స్థలాన్ని సదరు మండల స్థాయి ప్రజాప్రతినిధి పేరు మీద అసైన్‌మెంట్ కింద (భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూపంపిణీ చేస్తుంది.) ఇచ్చేందుకు ఫైల్ సిద్ధం చేయమని ఆదేశించినట్లు తెలిసింది. ఇలా చేయడం ఇబ్బంది అవుతుందేమో.? ఇప్పటికే ఆ స్థలంలో పార్కు నిర్మిస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. ఇప్పుడు ఇలా ఇస్తే.. బాగుండదేమో? చెడ్డపేరు వస్తుందేమో? సార్ అన్నట్లు తెలిసింది. అవంతా మీకెందుకు? మీరు అసైన్‌మెంట్ జాబితాలో దీనిని చేర్చండని చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణ కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను అసైన్‌మెంట్ ద్వారా ఇవ్వకూడదు. ఏదైనా ప్రజల అవసరం కోసం మాత్రమే ఈ భూములను సాధారణంగా ఉపయోగించాలి. అయితే స్వయంగా ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంతో అధికారులు కక్కలేక.. మింగలేక.. ఇరుకునపడ్డట్లు తెలిసింది. ఈ విషయం ఈ నోటా.. ఆనోటా బయటపడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఇది చర్చనీయాంశంగా మారింది. అధికారులు, అనధికారుల మధ్య ఇదే చర్చ నడుస్తోంది. విలువైన ఆ భూమి మీద కన్నుపడి.. కోరిక కోరినా.. దానిని వద్దని చెప్పాల్సిన ఎమ్మెల్యేనే.. ఆ ప్రజాప్రతినిధికి కట్టబెట్టేందుకు అధికారులపై ఒత్తిడి తేవడంపై మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఎంతో విలువైన ఈ భూమిని.. తమ పార్టీకి చెందిన చోటా ప్రజాప్రతినిధికి నిబంధనలకు విరుద్ధంగా సంతర్పణ చేస్తారా? ప్రజల అవసరాల కోసం కాపాడతారా? అన్నది వేచి చూడాల్సిందే.

మరణించిన ఓటరు కమురూన్   మరణించినా రెండు ఓట్లున్న అజాద్‌వలీ



తవ్వే కొద్దీ తప్పులే!

- ఏమాత్రం ప్రక్షాళన కాని ఓటరు జాబితా
- డబుల్ ఎంట్రీలు, మరణించిన కేసులు యథాతథం

కలికిరి, జనవరి 31: రకరకాల వడపోతల అనంతరం వెలువరించిన తాజా ఓటరు జాబితా కూడా తప్పుల తడకగా ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న రాజకీయ పార్టీల ఏజెంట్లు కొత్త ఓటరు జాబితా చూసి అవాక్కవుతున్నారు. గతంలో బీఎల్వోలతో పాటు ఇంటింటికీ తిరిగి గుర్తించిన తప్పులను సరిచేసేందుకు జాబితాలిచ్చినా అవన్నీ యథాతథంగా తాజా జాబితాలో పునరావృతమయ్యాయి. కొంతమంది మరణించిన ఓటర్ల పేర్లు గుర్తించి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అందులో ఒక్కటి కూడా తొలగించకపోవడమే కాకుండా కొంతమంది చనిపోయిన వారి పేర్లు రెండు చోట్ల ఉండటం విశేషం. 188వ పోలింగ్ కేంద్రంలో పట్టణంలోని కొత్తపేట వీధికి చెందిన బండారు త్రివేణి పేరు ఒకే ఇంటి నెంబరుతో వరుసగా 3, 4 సీరియల్ నెంబర్లలో పునరావృతమైంది. అదే పోలింగ్ కేంద్రంలోని 46, 170 సీరియల్ నెంబర్లతో ఒకే ఇంటి నెంబరుతో కాములూరి బావాజీ పేరు రెండు చోట్ల ఉంది. చదివేవాండ్లపల్లె 194 పోలింగ్ కేంద్రంలోని బి.కమ్రూన్ మృతి చెందినా సీరియల్ నెంబరు 348లో ఓటు ఉంది. అదే పోలింగ్ కేంద్రంలోని వేంపల్లె అజాద్ వలీ పేరు 135, 524 వరుస నెంబర్లతో ఉంది. ఇలా లెక్కకు మించి దాదాపు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ జాబితాలు తప్పుల తడకలుగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి కాకుండా పట్టణంలోని 186 పోలింగ్ కేంద్రంలో మొత్తం 22 మంది చనిపోయిన వారి పేర్లు జాబితాలో చోటు చేసుకున్నాయి. ఇదే పోలింగ్ కేంద్రంలో 9 మంది పేర్లు రెండేసి చోట్ల ఉన్నాయి. 187 పోలింగ్ కేంద్రంలో మరో రెండు చనిపోయిన వారి పేర్లు జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. ఇలా మండల వ్యాప్తంగా దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల జాబితాలు కూడా తప్పుల తడకలుగా ఉన్నాయి. ఇవన్నీ బీఎల్వోల నిర్లక్ష్యం కారణంగా జరిగాయా లేక మరేదైనా కారణాలతో జరిగాయా అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.


డబుల్ ఎంట్రీతో రెండు ఓట్లున్న కాములూరి బావాజీ, బండారు త్రివేణి

నేడు కబడ్డీ ఫైనల్ పోటీలు

- రసవత్తరంగా సాగిన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు


హోరాహోరీగా తలపడుతున్న తమిళనాడు-హర్యానా జట్లు

రాజంపేట, జనవరి 31: నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం ప్రీక్వార్టర్స్ ఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గురువారం ఉదయం 10 గంటలకు ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రీక్వార్టర్ ఫైనల్ పోటీల్లో చత్తీస్‌ఘడ్-వెస్ట్‌బెంగాల్ తలపడగా 41 పాయింట్లతో చత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్-హిమాచల్‌ప్రదేశ్ జట్లు తలపడగా ఉత్తరప్రదేశ్ జట్టు 12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. తమిళనాడు-హర్యానా జట్లు తలపడగా తమిళనాడు జట్టు 16 పాయింట్లతో విజయం సాధించింది. ఢిల్లీ-తెలంగాణా జట్లు తలపడగా ఢిల్లీ 22 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. రాజస్థాన్-బీహార్ జట్లు తలపడగా రాజస్థాన్ జట్టు 7 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. పంజాబ్-ఉత్తరాఖండ్ జట్లు తలపడగా పంజాబ్ 4 పాయింట్లతో విజయం సాధించింది. కేరళ-మహారాష్ట్రల మధ్య పోటీపడగా మహారాష్ట్ర 32 పాయింట్లతో విజయం సాధించింది.

సెమీఫైనల్స్‌కు మహారాష్ట్ర-రాజస్థాన్ జట్లు

జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో మహారాష్ట్ర-రాజస్థాన్ జట్లు సెమీఫైనల్స్‌కు వెళ్లాయి. బుధవారం జరిగిన హోరాహోరీ పోరులో పంజాబ్-మహారాష్ట్ర మధ్య పోటీ రసవత్తరంగా జరగగా మహారాష్ట్ర 25 పాయింట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. అదేవిధంగా ఢిల్లీ-రాజస్థాన్ జట్ల మధ్య జరిగిన పోటీలో రాజస్థాన్ 22 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. గురువారం ఉదయం సెమీఫైనల్ పోటీలు, అనంతరం ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

రాజంపేట ఆర్డీవో బదిలీ

రాజంపేట, జనవరి 31: రాజంపేట ఆర్డీవో రామకృష్ణారెడ్డిని అనంతపురం జిల్లా డీఆర్‌వోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఇటీవల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారెడ్డి అనంతపురం డీఆర్‌వోగా నియమితులయ్యారు. అదేవిధంగా రాజంపేట తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



రాయచోటిటౌన్, జనవరి 31: జిల్లా కేంద్రమైన రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా వి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రాయచోటి మున్సిపాల్టీకి వచ్చారు. ఈ మేరకు కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్న అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం మెరుగునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు.

ఇండియా టెస్ట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా రామకృష్ణ



వాల్మీకిపురం, జనవరి 31: వైజాగ్‌లో ఫిబ్రవరి 2 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న ఇండియా-ఇంగ్లాండ్ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ సభ్యుడు రామకృష్ణ ఎంపికైనట్లు వీసీసీ అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ తెలిపారు. రామకృష్ణ తొలుతగా స్థానిక క్రికెట్ క్లబ్‌లో క్రీడాకారుడిగాను, స్కోరర్‌గా ఉన్నాడు. జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో నిర్వహించిన స్కోరర్ పరీక్షలో ఎంపిక కావడం తరువాత జిల్లా అసోసియేషన్ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్యానల్ స్కోరర్ పరీక్షలో ఎంపికయ్యాడు. 2017 నుంచి జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లకు రామకృష్ణ స్కోరర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆరేళ్ల తరువాత ఏసీఏ ప్యానల్ నుంచి అవకాశం రావడం పట్ల రామకృష్ణ సంతోషం వ్యక్తం చేశాడు. తనకు అవకాశం కల్పించిన ఏసీఏ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపాడు. రామకృష్ణ ఎంపిక పట్ల కోచ్ సునీల్‌కుమార్, వీసీసీ సభ్యులు, షాహెద్, భరత్, రెడ్డి, లాలా, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

హరితం.. ఆ పాఠశాల సొంతం..

- ఉపాధ్యాయుడికి జాతీయ అవార్డు

వాల్మీకిపురం, జనవరి 31: హరితవనం అంటే వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనే చెప్పాలి. అదే దిశగా ఆ పాఠశాలకు జాతీయ ల్యాండ్ మేనేజ్‌మెంట్ హరిత పాఠశాల అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సంస్థ ఆర్థిక సాయంతో నేషనల్ గ్రీన్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఉన్న 1.75 ఎకరాల స్థలంలో 2017 సంవత్సరం నుంచి రూ.7లక్షల ఖర్చుతో మియావాకి మినీ ఫారెస్ట్ పెంపకం కార్యక్రమం చేపట్టారు. దుక్కిలు, ఎరువులు, మొక్కల పెంపకం, డ్రిప్, పరిరక్షణ, తదితర కార్యక్రమాలు పూర్తిగా మాస్ సహకారంతో జరుగుతున్నాయి.

ఆరు విభాగాలలో..

గాలి, నీరు, ఎనర్జీ, ల్యాండ్, ఆహారం, వ్యర్థాల నిర్వహణ అనే అంశాలలో వివిధ పాఠశాలలు పోటీ పడగా అందులో గండబోయనపల్లె ఉన్నత పాఠశాల మొదటిగా నిలిచి అవార్డుకు ఎంపికైంది. గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్, విద్యార్థులు గత ఆరేళ్ల కాలంగా చేసిన కృషి వల్లే ఇది సాధ్యమైంది. పాఠశాల ఆవరణలో పచ్చదనం విద్యార్థులకు ఆరోగ్య వాతావరణంగా మారింది. నిత్యం గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్‌తో కలిసి విద్యార్థులు సైతం హరితవనం అభివృద్ధి పనులలో నిమగ్నమవుతుంటారు. ఎటుచూసినా పచ్చదనం పాఠశాల సొంతమనే చెప్పాలి.


గ్రీన్ స్కూల్ ప్రోగ్రాం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్ కిశోర్‌కుమార్

జాతీయ అవార్డు పాఠశాల సొంతం..

గండబోయనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ ల్యాండ్ మేనేజ్‌మెంట్ హరిత పాఠశాల అవార్డు దక్కింది. దేశ వ్యాప్తంగా 5 కేటగిరిలలో మొత్తం 200 ప్రాజెక్టులను పొందు పరచగా అత్యద్భుతంగా తీర్చిదిద్దన హరితవనం విషయంలో ఈ పాఠశాలకు చెందిన గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్ అగ్రస్థానంలో నిలిచి మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో యునెస్కో ప్రతినిధి జూలియామార్టన్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. దేశంలోనే గండబోయనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలిచింది.

అందరి సహకారంతో..



పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది సహకారంతోనే జాతీయ అవార్డు దక్కింది. ముున్ముందు పాఠశాల అభివృద్ధికి మరింత మెరుగైన ఆలోచనల దిశగా ముందుకు వెళ్తాం. గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్ కృషి అభినందనీయం. పాఠశాల ఆవరణం మొత్తం హరితవనంగా మారిపోయింది.

- రెడ్డిమోహన్, హెచ్ఎం, గండబోయనపల్లె హైస్కూల్, వాల్మీకిపురం


హైస్కూల్‌లో హరితవనం పనులలో విద్యార్థులు

అవార్డు మరింత బాధ్యత పెంచింది..



ఉపాధ్యాయుడిగా విద్యార్థులలో చైతన్యం, పాఠశాలకు ఏదో చేసి తీరాలన్న సంకల్పం నన్ను ముందుకు నడిపించాయి. చిన్ననాటి పాఠశాల రోజుల్లో పాఠ్య పుస్తకాలలోని చిప్కో మూమెంట్‌లో సుందరలాల్ బహుగుణ అందించిన సేవలను ఆదర్శంగా తీసుకున్నా. ఆయన తనదైన శైలిలో పర్యావరణ పరిరక్షణ, ట్రైబల్ ప్రజల్లో తెచ్చిన చైతన్యం స్ఫూర్తిని నింపాయి. ఆ దిశగానే పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాం. జాతీయ అవార్డు మాపై మరింత బాధ్యత పెంచింది. పాఠశాలకు ఇంతటి గుర్తింపు రావడం చాలా సంతోషంతో పాటు గర్వంగానూ ఉంది.

- కిశోర్‌కుమార్, గ్రీన్ టీచర్, గండబోయనపల్లె హైస్కూల్, వాల్మీకిపురం



ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యం

- స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి
- బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ అభిశిక్త్ కిశోర్


కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న అభిశిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 31: జిల్లా ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యమని కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ తెలిపారు. అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూడటమే లక్ష్యమని చెప్పారు. స్పందనకు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని వర్గాల వారిని కలుపుకుని సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకునే ముందు పట్టణంలోని వీరభద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. నూతన కలెక్టర్‌కు కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఉమ్మడి కడప జిల్లాలోని 59 మంది తహసీల్దార్ల బదిలీ

కడప (కలెక్టరేట్) జనవరి 31 : సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జోన్-4 పరిధిలోని ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 59 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే ఇతర జిల్లాల నుంచి 59 మంది తహసీల్దార్లను ఇక్కడికి బదిలీ చేసింది. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనరు బదిలీ కానున్న తహసీల్దార్ల జాబితాను బుధవారం ప్రకటించారు. మూడేళ్ల పైబడిన వారందరూ బదిలీ కానున్నారు. వీరిని జోన్ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో పదవీ విరమణ కానున్న నలుగురితో పాటు మూడేళ్లలోపు సర్వీసు ఉన్న ఇద్దరిని ఎన్నికల కమిషన్ బదిలీల్లో మినహాయింపు ఇచ్చింది. వారు ఎన్నికల విధులకు దూరంగా ఉండనున్నారు.

గుట్టుగా గంజాయి సరఫరా

- హాట్‌టాపిక్‌గా మారిన పట్టుబడ్డ గంజాయి వ్యవహారం
- పూర్తి వివరాల సేకరణలో పోలీసులు
- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- నిందితుల కోసం వేట

ములకలచెరువు, జనవరి 31: ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీలోని సంద్రడివి అటవీ ప్రాంతం వద్ద భారీగా పట్టుబడ్డ గంజాయి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం గంజాయి అక్రమ రవాణాపై ములకలచెరువు సర్కిల్ పోలీసులు దాడులు చేసి 70 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. గతంలో ఎన్నడూ లేని విధంగా మారుమూల ప్రాంతంలో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడడంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మారుమూల ప్రాంతాలకు కూడా గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ విక్రయాలు జరుపుతున్నట్లు ఈ ఘటనలో వెలుగులోకి వచ్చింది. ములకలచెరువు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, కురబలకోట తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు వెల్లడవుతోంది. ముఖ్యంగా స్మగ్లర్లు, విక్రయదారులు కళాశాలల వద్ద గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే పలువురు యువకులు గంజాయి బారిన పడినట్లు సమాచారం. ఆరు నెలల క్రితం కూడా గంజాయి విషయమై ములకలచెరువుకు చెందిన ఓ యువకుడిని శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు పట్టుకెళ్లి విచారణ జరపడంతో అప్పట్లో కూడా చర్చనీయాంశమైంది. తాజాగా ములకలచెరువు మండలంలో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడడంతో రవాణా, విక్రయాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నట్లు వెల్లడవుతోంది. ఈ క్రమంలో గంజాయితో పాటు పట్టుబడ్డ ఓ నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి స్థాయిలో వివరాల సేకరణ చేస్తున్నారు. పరారీలో ఉన్న స్మగ్లర్ల కోసం పోలీసులు వేట ప్రారంభించారు. నిందితుల కోసం నాలుగు బృందాల్లో పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులను పట్టుకునేందుకు పలు ప్రాంతాలకు వెళ్లారు. కాగా సంద్రడివిలో గంజాయిని ఇతర వాహనంలోకి మార్చే సమయంలో స్మగ్లర్లు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా స్మగ్లర్లు ఖరీదైన కార్లలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది.

సంద్రడివి కేంద్రంగా అక్రమ రవాణా...?

ములకలచెరువు మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతమైన సంద్రడివి కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు వెల్లడవుతోంది. వేపూరికోట సమీపంలోని ముంబాయి జాతీయ రహదారి పక్కన ఉన్న బి.కొత్తకోటకు వెళ్లేందుకు సంద్రడివి నుంచి తారురోడ్డు ఉంది. ఈ మార్గంలో అంతంతమాత్రంగానే వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీనిని అనువుగా భావించిన స్మగ్లర్లు గంజాయి అక్రమ రవాణాకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం, తిరుపతి నుంచి మదనపల్లె మీదుగా ఖరీదైన కార్లలో ములకలచెరువు మండలం సంద్రడివికి తీసుకొచ్చి ఇక్కడి నుంచి ఇతర వాహనాల్లో బి.కొత్తకోట, కర్ణాటక రాష్ట్రానికి గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే సంద్రడివిలో స్మగ్లర్లు గంజాయి ఇతర వాహనంలో మారుస్తుండడంతో పోలీసులకు సమాచారం వచ్చిందని భావిస్తున్నారు. ఏది ఏమైనా పూర్తిస్థాయి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.


ములకలచెరువు మండలం సంద్రడివిలో తనిఖీలు చేస్తున్నప్పుడు పోలీసులు స్వాధీనం గంజాయి మూటలు

పెండింగ్ బిల్లుల మంజూరెప్పుడు ..?

- జగనన్నా... ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెలా...
- నీటి వసతి లేక లబ్ధిదారులకు అగచాట్లు
- రోడ్లు సైతం లేని వైనం
- ముందుకు సాగని నిర్మాణాలు
- పట్టించుకోని జిల్లా అధికారులు



జగనన్న కాలనీలో నీళ్లు లేక ఆగిపోయిన నిర్మాణాలు



కాలనీలో నీళ్లలేక ఎండిపోతున్న ట్యాంకులు

జమ్మలమడుగు, జనవరి 31: జమ్మలమడుగు అంబవరం పాలిటెక్నిక్ కళాశాల పక్కన జగనన్న కాలనీ లబ్ధిదారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో మూడు ఫేస్‌లకు సంబంధించి సుమారు మూడు వేల గృహాలకు వెంచర్లు వేశారు. ఫేస్-1లో ఇప్పటి వరకు పది మంది ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉన్నారు. మిగతా ప్లాట్లలో వివిధ దశల్లో నిర్మాణాలు జరిగాయి. ఎక్కువ శాతం ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. ఫేస్-1లో 354 నంబరు నుంచి 1700 నంబరు వరకు నీళ్లు లేక నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక ఫేస్-2, 3లలో ఎక్కడా నీళ్లు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 354 నంబరు నుంచి ట్యాంకులు పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు కూడా లేక లబ్ధిదారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. జగనన్న కాలనీలో అన్నీ సమస్యలే ఉన్నాయని వాపోతున్నారు.

జమ్మలమడుగు పట్టణం నుంచి ఇంటి నిర్మాణం కొరకు సామగ్రి తెచ్చుకోవాలన్నా ఇబ్బందికరంగా మారింది. సిమెంటు, ఇటుకలు, కడ్డీలు తెచ్చుకుని ఇంటి నిర్మాణం చేపట్టడానికి ఇంటిస్థలం వద్ద నిలిపితే.. అదే రోజు రాత్రే చోరీకి గురవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక నీళ్లు తెచ్చుకోవాలంటే ఒక్క ట్యాంకరుకు రూ.1100లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇంటి వద్దనే రోజంతా ట్యాంకు పెట్టుకోవాలంటే అదనంగా మరో రూ.300 మొత్తం రూ.1400-రూ.1500 ఒక ట్యాంకు నీళ్లకే ఖర్చు అవుతుందంటున్నారు. ఇసుక జగనన్న కాలనీ పేరుతో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని, కాలనీలో లబ్ధిదారులకు ఇసుక కరువైపోతోందని వాపోతున్నారు. ఇక అలంకారప్రాయంగా కరెంటు స్తంభాలు ఉన్నాయని, కొన్నిచోట్ల మాత్ర మే మీటర్లు బిగించారని, లబ్ధిదారులు డబ్బులు చెల్లించి మీటర్ల కోసం ఎదురుచూస్తున్నట్లు వాపోతున్నారు. కాలనీలో ఏమాత్రం ఎక్కడ రోడ్లు లేవని, ప్రధాన రోడ్డుకే సిమెంటు రోడ్డు లేదని తెలిపారు. ప్రధాన రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీగోడ పక్కన రోడ్డుపై కరెంటు స్తంభం దారికి అడ్డంగా ఉందని, దానిపక్కనే బోరు ఉందని, దారికి అడ్డంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదంటున్నారు.



జగనన్న కాలనీలో మట్టి రోడ్డే గతి

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీకి అనేక సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు, జిల్లా అధికారులు, లబ్ధిదారులు అడుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అయితే పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వడం లేదని ఇలా ఉంటే ఇళ్ల నిర్మాణాలు ఎలా ముందుకు సాగుతాయని లబ్ధిదారులు వాపోతున్నారు. డబ్బులు లేక పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి అప్పులు చేసి బిల్లులు వస్తాయని ఎదురుచూస్తున్నా రావడం లేదని, ప్రభుత్వం జగనన్న ఇళ్ల పేరుతో లబ్ధిదారులకు అప్పులు తప్ప ఏమాత్రం లాభం లేదని సమస్యలే పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యలకు సంబంధించి అధికారులు స్థానిక మున్సిపాలిటీ ఫండ్స్‌లో సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే జగనన్న కాలనీలో ప్రస్తుతం ఒక బోరు మాత్రమే పనిచేస్తోందని, అది కూడా ఎప్పుడు నిలిచిపోతుందో అప్పుడు కాలనీ అంతా నీటి ఎద్దడి ఏర్పడుతుందని వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చేతులెత్తేసినట్లుగా తెలు స్తోంది. అందులో హౌసింగ్ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

ఈ సమస్యకు సంబంధించి హౌసింగ్ ఏఈ ఓబులేసును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జగనన్న కాలనీలో నిర్మాణాలు జరగడం లేదని, పెండింగ్ బిల్లులు రావడంలేదని, నీళ్లు కూడా లేక ఒక బోరు మాత్రమే పనిచేస్తోందని నీళ్ల బోర్లకు నిధులు లేక మున్సిపాలిటీ అధికారులకు జిల్లా అధికారులు ఆదేశించినా మున్సిపల్ అధికారులు నిధులు లేవని జగనన్న కాలనీ సమస్యలు వదిలేసినట్లుగా తెలిపారు.

మీ సేవలు చిరస్మరణీయం

ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ సిద్ధార్థ కౌశల్



పోలీసు కుటుంబాలకు జ్ఞాపికలను అందిస్తున్న ఎస్పీ

కడప (క్రైం), జనవరి 31 : దాదాపు 35 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల పాటు అంకితభావంతో అందించిన మీ సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ పొందిన కమాండ్ కంట్రోల్ ఎస్ఐ కె.ఓబయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఓబుల్‌రెడ్డిలను ఆయన సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన సమయంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వహించడం కష్టమైన పని అన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. పదవీ విరమణ తరువాత కూడా మీరు పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, శివరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబసభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

రెండోరోజు నిడుజువ్విలో సినిమా షూటింగ్

భారీగా తరలివచ్చిన అభిమానులు



షూటింగ్ జరుగుతున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 31: తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా షూటింగ్ రెండో రోజైన బుధవారం కూడా నిడుజువ్వి గనుల్లో జరిగింది. సినిమా హీరో రజనీకాంత్ కోసం వేసిన ప్రత్యేక సెట్స్ ఆయన పాల్గొన్నారు. సాయంత్ర 5.30 గంటల వరకు జరిగిన షూటింగ్‌లో ఆయన వివిధ సన్నివేశాల్లో పాల్గొన్నారు. అనంతరం నాపరాయిగని యజమాని ఎస్.మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆయనకు గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు హీరోయిన్ రిత్వికాసింగ్, విలన్స్ కూడా పాల్గొన్నారు. రెండురోజులపాటు ఆయన ఇక్కడే షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు ఆయన సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన చిన్న

రాజంపేటటౌన్, జనవరి 31: రాజంపేట పట్టణంలోని శివాలయం సమీపంలో చిన్న (19) అనే యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం పట్టణంలోని కడప-తిరుపతి ప్రధాన రహదారిలో శివాలయం వద్ద బైకుపై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూసి భయాందోళనకు గురై అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావం కావడంతో యువకుడు చిన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను కర్నూలు జిల్లా బాటతాండా గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. జీవనోపాధికి వారి తల్లిదండ్రులతో కలిసి రాజంపేట శివారులోని ఎన్.టి.ఆర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవన సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటన తెలుసుకున్న పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్థానికంగా సీసీ ఫుటేజీల ద్వారా పూర్వాపరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



షేక్ అస్లాం

ఖాజీపేట, జనవరి 31: మండలంలోని కొమ్మలూరు గ్రామానికి చెందిన ఖాదర్‌బాష కుమారుడు షేక్ అస్లాం బుధవారం అదృశ్యమయ్యాడు. ఖాజీపేట స్కూలులో 10వ తరగతి చదువుతూ ప్రభుత్వ హాస్టల్‌లో ఉండేవాడు. బుధవారం ఉదయం టిఫిన్ తిని స్కూలుకు వెళుతున్నాని చెప్పి స్కూల్‌కు రాకపోవడంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థి తల్లిదండ్రులు అంతా గాలించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎక్కడైనా కనిపిస్తే 9121100623 అనే నంబరుకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కడప (క్రైం), జనవరి 31 : కడప నగరం సాయిపేటలోని ఎ-1 నగర్‌లో గత నెల 27న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై కత్తితో దాడి చేసిన కేసులో షేక్ అర్షిద్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ తబరేజ్ తెలిపారు. సాయిపేటలోని ఏ-1నగర్‌కు చెందిన షేక్ అర్షిద్ అల్లరిగా తిరుగుతూ అందరినీ బెదిరిస్తూ ఉండేవాడన్నారు. గత నెల 24న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు



బార్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ సుభాషిణి

బద్వేలు టౌన్, జనవరి 31 : బద్వేలులో ఎక్సైజ్ సీఐ సుభాషిణి తన సిబ్బందితో కలిసి బుధవారం రెండు బార్ అండ్ రెస్టారెంట్లను తనిఖీ చేశారు. 'కోడి కూతకు ముందే కిక్' అని ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్తకు ఎక్సైజ్ అధికారుల్లో చలనం వచ్చింది. మద్యం శాతాన్ని గుర్తించి తనిఖీలు చేశారు. సమయపాలన లేకుండా బార్ అండ్ రెస్టారెంట్లు తెరిచి మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని, సమయపాలన పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి అరెస్టు

60 మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం బాటళ్లతో నిందితుడు

కడప (క్రైం), జనవరి 31 : కడప నగరం బిల్డప్‌సర్కిల్ వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ రాజా తెలిపారు. కడపకు చెందిన యువకుడు మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో కడప డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు అతన్ని అరెస్టు చేసి అతని వద్ద నుండి 60 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వల్లూరులో 48 బాటిళ్లు...

వల్లూరు, జనవరి 31 : మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న విషయం తెలవడంతో స్థానిక ఎస్ఐ వెంకటరాముడు తన సిబ్బందితో కలిసి దాడి చేసి 48 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు అక్రమంగా మద్యం అమ్ముతున్నారని తెలియడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి 48 మద్యం బాటళ్లతో పాటు సంజీవ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జనవరి 31: భర్తతో గొడవ పడి ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదన పల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీకి చెందిన విద్యావాణి(36) భర్త సోమశేఖర్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. చంద్రశేఖర్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు వుండగా, విద్యావాణికి ఒక కొడుకు వున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం విద్యావాణి తన భర్త చంద్రశేఖర్‌తో గొడవ పడింది. పిల్లలు తాము ఒకే ఇంట్లో ఉండలేమని, మిద్దెపైన ఇంకో గది నిర్మించాలని వాగ్వాదం చేసింది. దీనికి సమ్మతించని చంద్రశేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆగ్రహించిన విద్యా వాణి ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది.

గమనించిన కుటుంబీకులు చంద్రశేఖర్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి ఉరి నుంచి విద్యావాణిని తప్పించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందిందని చెప్పారు. తాలూకా ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు తుపాకీతో దంపతులపై దాడి



గాయపడిన రెడ్డిశేఖర్‌రెడ్డి

కురబలకోట, జనవరి 31: నాటు తుపాకీతో దంపతులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు క్రాస్ పంచాయతీ దిన్నిమీదపల్లెకు చెంది న దంపతులు జి.రెడ్డిశేఖర్‌రెడ్డి (55), సరస్వతమ్మ (50)లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు గ్రామ సమీపంలో పొలంలో పంటలు సాగు చేస్తున్నారు. కాగా బద్దిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి అలియాస్ మల్‌రెడ్డి వీరి పొలం పక్కనే పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. కాగా పొలంలో పంట విషయమై ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జునరెడ్డి తన వద్ద నున్న నాటు తుపాకీతో దాడి చేసి దంపతులను గాయపరిచారు. గాయపడ్డ వారిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంక స్థలంలో అక్రమ కట్టడాలు

- రూ.కోట్ల విలువ చేసే స్థలానికి ఎసరు
- అడ్డుకున్న రెవెన్యూశాఖాధికారులు



వంకపోరంబోకు భూమి స్థలంలో అక్రమంగా నిర్మించిన కంచె

రైల్వేకోడూరు, జనవరి 31: ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు బడాబాబులు, నాయకులు గద్దల్లా వాలిపోయి కబ్జా చేసి నిర్మాణాలు చేసేస్తున్నారు. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ పరిధిలోని గంగరాజపురం ప్రధానదారికి పక్కనే సర్వే నెంబరు 38-1లో 50 సెంట్ల భూమని ఆక్రమించుకుని దర్జాగా ఇంటి నిర్మాణాలు సాగిస్తున్నారని రాఘవరాజపురం వీఆర్వో నిరంజన్ తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. తమకు పట్టాలు ఉన్నాయని కబ్జాదారులు చెప్పడంతో వివాదం చోటుచేసుకుంది. వంకపరంబోకు స్థలంలో ఎవరూ కట్టడాలు చేయరాదని రెవెన్యూశాఖాధికారులు చెప్పడంతో పనులు ఆపేశారు. ఇదిలా ఉంటే సర్వే నెంబరు 38-1లో 2.14 ఎకరాల భూమి ఉంది. ఏడాదిన్నర క్రితం స్థానిక ప్రజల వినతి మేరకు రెవెన్యూ శాఖాధికారులు రీసర్వే చేయించారు. దీంతో సర్వే నెంబరు 178గా మారింది. వంక పొరంబోకు స్థలం మొత్తం మీద 50 సెంట్లు ఉందని, మిగిలినవి రైతులకు పట్టాలు మంజూరు చేశారని రైతులు తెలిపారు. ఈ స్థలం కొంత మేరకు రోడ్లు భవనాల శాఖ పరిధిలోకి, మరికొంత ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని రెవెన్యూ శాఖాధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ స్థలం ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో రూ.5 కోట్ల విలువ చేస్తుందని అంచనా. దీనిపై అందరి కన్నుపడింది. కొందరు ఇందులో కొంత స్థలాన్ని విక్రయాలు చేసుకున్నారని ప్రచారం సాగింది. పలుసార్లు ఈ స్థలంపై వివాదాలు చోటుచేసుకున్నాయి. కొందరు బడా వ్యక్తులు ప్లాట్లు వేసి విక్రయాలు చేయాలని చూశారు. స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో వెనక్కు తగ్గారు. మళ్లీ ఇదే స్థలంలో కట్టడాలు ప్రారంభించడంతో వివాదాలకు దారి తీస్తోంది. ఎన్నికల సమయంలో పెద్ద ఖద్దరు బాబులు ఏమి కాదు ఏమైనా చేసుకోండి అని సలహాలు ఇవ్వడంతో కొందరు వంక పొరంబోకు స్థలానికి స్కెచ్ వేశారు. నకిలీపత్రాలు చూపి కట్టడాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒకరు అయితే ఏకంగా షెడ్డు నిర్మాణం చేసి ఉన్నారు. దీనిని కూడా తొలగించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. సర్వే నెంబరు వేరే వేసుకుని కట్టడాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంక పొరంబోకు స్థలాలను ప్రభుత్వ అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వంకపరంబోకు స్థలాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైల్వేకోడూరు డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి తెలిపారు. రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురంలో వంక పొరంబోకు స్థలంలో ఇంటి నిర్మాణాలు సాగుతున్నాయని ఫిర్యాదు రావడంతో వీఆర్వో వెళ్లి అడ్డుకుని పనులు నిలుపు చేయించారన్నారు. ఈ స్థలంపై పలువురు కోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో రెవెన్యూశాఖ కూడా కోర్టులో రీకౌంటర్ దాఖలు చేసిందన్నారు. ఇరిగేషన్ శాఖ వారికి సంబంధించిన భూమి కాబట్టి వారు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏదిఏమైనా వంకపొరంబోకు స్థలాలను ఆక్రమించరాదు, కట్టడాలు చేయరాదు అని చట్టంలో ఉందని తెలిపారు.




వంకపొరంబోకు భూమిలో ఇంటి నిర్మాణాలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రాణాలు నిలిపిన హెల్మెట్



చిన్నరంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బైకు

పులివెందుల రూరల్, జనవరి 31: మున్సిపల్ పరిధిలోని చిన్నరంగాపురం సమీపంలో బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలను హెల్మెట్ కాపాడింది. స్థానిక ప్రజలు, ద్విచక్రవాహనదారుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల నుంచి లింగాల వైపునకు బైకులో ఓ వ్యక్తి వెళ్తుండగా లింగాల వైపు నుంచి పులివెందులకు ఓ కారు వస్తోంది. ఇంతలో పులివెందుల వైపు నుంచి లింగాలకు వెళ్తున్న ఓ ఆటో బైకును ఓవర్ టేక్ చేయబోయింది. రోడ్డు డబుల్ రోడ్డు కావడంతో ఓవర్‌టేక్ సమయంలో ఎక్కువ గ్యాప్ లేక ఎదురుగా వస్తున్న కారును ఆటో స్వల్పంగా ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన కారు ఆటో వెనుక వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనవారుడు ఎగిరిపడి కారు అద్దంపై పడ్డాడు. ద్విచక్రవాహనదారుడి కాళ్లకు, కుడిచేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన ఆటో అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోవడంతో ఎవరు గుర్తించలేకపోయారు. ఈ ప్రమాదంలో కారు ముందుబాగం, అద్దం దెబ్బతినగా ద్విచక్ర వాహనం ముందు భాగం అంతా నుజ్జునుజ్జు అయింది. 108కు ఫోన్ చేసి ద్విచక్రవాహనదారున్ని పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అయితే ద్విచక్రవాహనదారుడుకు హెల్మెట్ ధరించకపోయింటే ప్రాణాలు పోయేవని అక్కడి సంఘటనతో స్పష్టమవుతోందని ప్రజలు చర్చించుకున్నారు.



CHANGE OF NAME

★ I, KHUDSEYA BANU (Old Name), Resident of #8-118, Agadi Street, KADAPA, A.P., India, I have changed my name to SYED KHUDSEYA BANU (New Name) AJH-002138

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 150700

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

WANTED

కడప మునిరావు వీధిలోని ఆపిల్ డిజిటల్స్ నందు పార్ట్‌టైమ్ పనిచేయుటకు అనుభవం కల్గిన కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. Cell:94413 23760

Ajc-176329

CHANGE OF NAME

FATHIMULLA RAHANA BEGUM (old name) W/o. FATHIMULLA CHAND BASHA, R/o # 5/103, FATIGARI STREET, CHENNUR, CHENNUR MANDAL, YSR DT, AP-516162, INDIA, do hereby Change My Name to FATHIMULLA REHANA BEGUM (New Name), Hence forth then new I may be called as FATHIMULLA REHANA BEGUM (New Name).

AJC-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్

● బాధ్యతలు చేపట్టిన సీఐ బాబు


సీఐగా బాధ్యతలు చేపట్టిన టి.బాబు

రైల్వేకోడూరు, జనవరి 31: చాలా కాలంగా రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ విషయం పెండింగ్‌లో ఉండేది. సుమారు 20 రోజుల క్రితం ప్రభుత్వం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసింది. గతంలో ఇద్దరు ఎస్ఐలు, ఒక సీఐ ఉండేవారు. ప్రస్తుతం అప్‌గ్రేడ్ కావడంతో ఒక ఎస్ఐ, ఇద్దరు సీఐలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైల్వేకోడూరు పట్టణ సీఐ, రూరల్ సీఐ ఇద్దరు ఉంటారు. ఓబులవారిపల్లె, చిట్వేలి రూరల్‌గా పరిగణించారు. ఈ రెండు మండలాలకు టి.మధుసూధన్‌రెడ్డి వ్యవహరిస్తారు. బుధవారం కొత్తగా వచ్చిన సీఐ టి.బాబు పట్టణ సీఐగా వ్యవహరిస్తారు. ఈయన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉంటారని పోలీసు వర్గాలు తెలిపాయి. సిబ్బంది కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. రైల్వేకోడూరులో ఎక్కువగా ఎర్రచందనం స్మగ్లింగ్, పేకాట, కోడిపందేలు, మట్కా తదితర అసాంఘిక కార్యక్రమాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయని గతంలో నివేదిక ప్రభుత్వానికి ఇచ్చినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడెక్కడ అప్‌గ్రేడ్ కాని పోలీస్‌స్టేషన్లు గుర్తించారు. వెంటనే నేరాలను అదుపులో ఉంచేందుకు అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో రైల్వేకోడూరు ఒకటి కావడం నేరాల అదుపులోకి వస్తాయని పోలీసు వర్గాలు చెబుతున్నారు.

ఎస్ఐగా సుభాష్ చంద్రబోస్


బాధ్యతలు చేపట్టిన సుభాష్ చంద్రబోస్

పెనగలూరు, జనవరి 31: పెనగలూరు ఎస్ఐగా బుధవారం ఇ.ఎ.సుభాష్ చంద్రబోస్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిట్వేలి నుండి పెనగలూరు నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



పుట్టగొడుగుల పెంపకం పరికరాలను చూపుతున్న అధికారులు

రైల్వేకోడూరురూరల్, జనవరి 31: పుట్టగొడుగుల పెంపకం ప్రతి రైతుకు లాభదాయకమని రైల్వేకోడూరు ఉద్యానశాఖాధికారి అనదుద్దీన్, డాక్టర్ కె.గోపాల్ తెలిపారు. బుధవారం ఉద్యాన కళాశాలలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరు చేసిన పుట్టగొడుగుల పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పుట్టగొడుగుల పెంపకంపై ప్రతి పంచాయతీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, దీని వలన రైతులు లబ్ధిపొందారని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో కాకుండా ఇతర రాష్ట్రంలో పుట్టగొడుగులకు డిమాండ్ ఉందని తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ రూత్‌మేరీ, వెంకటరెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

దళితవాడకు తాగునీరు అందించండి


తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం, జనవరి 31: మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ ముమ్మడి గుంటపల్లి దళితవాడకు తాగునీరు అందించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు. నీళ్లు లేక రెండు నెలలు అవుతోందని, గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. తాగునీటి కోసం రైతు పొలాల వద్దకే వెళితే వారు అభ్యంతరం చెబుతున్నారని, తాగునీరు లేకుండా తామెలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు తాగునీరు అందించాలని వారు వేడుకున్నారు. చెడిపోయిన మోటారుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో జవహర్ బాబును వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, తాగునీరు అందించేందుకు ఈవోపీఆర్‌డీకి, పంచాయతీ కార్యదర్శికి ఆదేశించామన్నారు.

PUBLIC NOTICE

Under Instructions from my client M/s Shriram Finance limited, RAYACHOTY branch I Issue the following notice.. My client company intends to grant a loan facility to **Sarvni Mahammad Ali Khan S/o. Ghouse Mohiddin Khan,** Door No 4/37A, Chinna mandem village, Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property Hence the public at large. banks. financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing Within seven days from the date of this notice for the below mentioned sche dule property otherwise it shall be dee med that there are no objectionfrom anybody and any objections received after seven days Wil not binding upon my clients company for the below schedule property

SCHEDULE OF PROPERTY

Annamayya District erstwhile Y.S.R. Kadapa District, Rayachoty Sub. Reg. Dist. in Chinnamandem Mandal, Chinnamandem Village an extent of 124.33 square yards R.C.C.building house bearing Door No 4/37A in Main Bazar, Peddamandem Road

Bounded by : **Item No.1**: East-House of Mayana Akbar Ali Khan West-Item No. 2 house/room. North-House of Mayana Akbar Ali Khan S. Mahammad Ali khan South - Sandhu Rasta **Measuring**: East - west = 15.6 feets; North-South =22.6 feets.

Item No.2: East-Item No.1 house/room West-Item No.3 house/room,North-House of Mayana Akbar Ali Khan,S.Mahammad Ali khan South-Sandhu Rasta **Measuring**:East-west; 7.6 feets;North-South= 17feets.

Item No.3: East-Item No.2 house/ room, West-Item No.4 house/ room North-House of Mayana Akbar Ali Khan, S.Mahammad Ali khan,South-Sandhu Rasta **Measuring**:East-west; 16.3 feets; North-South=11 feets.

Item No.4: East-Item No.3 house/room, Maya na Akbar Ali Khan,West-Raja Veedhi (main Road) North-House of S. Mahammad Ali khan, South - Sandhu Rasta

Measuring:East-west=17.6feets;North-South=27 feets.R.C.C.building With doors, doorframes, Windows, almaras and all fittings atta ched to the building with easementary right.

(Property covered in registered sale deed No. 3656/2002)

C. Sunil Kumar Reddy, B.A.,B.L.,
Advocate, Rayachoty, Cell No. 9441738746.

ఒక్కసారి ఆశీర్వదించండి.. మీకు రుణపడి ఉంటా

● మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి


నూలివీడులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రమేశ్‌కుమార్‌రెడ్డి

గాలివీడు, జనవరి 31: 'నన్ను ఒక్కసారి మీరందరూ ఓటు వేసి ఆశీర్వదించండి.. మీకు అందరికి జీవితాంతం రుణపడి ఉంటాను' అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆయన బుధవారం మండలంలోని నూలివీడు పంచాయతీలో 'రా కదిలిరా' భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన నాటి నుంచి అరాచకం తప్ప అభవృద్ధి చేసింది శూన్యమన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు అన్యాయానికి గురయ్యారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ టీడీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మన రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందని, తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని కొనియాడారు. అనంతరం ఆవులరెడ్డిగారిపల్లె, ఆవుల వాండ్లపల్లె, ఇందిరమ్మకాలని, నక్కలవాండ్లపల్లె, జల్లావాండ్లపల్లె, అలుగుంటివాండ్లపల్లెలో ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, పూలుకుంట సర్పంచు పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచులు ప్రభాకర్ నాయుడు, భద్రప్పనాయుడు, మహ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటశివారెడ్డి, టీడీపీ నాయకులు మిట్టపల్లె వెంకటరమణారెడ్డి, నాగేశ్వరరావు, యోగాంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, శివప్పనాయుడు, చక్రీయబాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావడం తథ్యం : పంతగాని


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పంతగాని నరసింహప్రసాద్

పెనగలూరు, జనవరి 31: రాష్ట్రంలో మరో 70 రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని నియోజకవర్గ టీడీపీ నాయకుడు పంతగాని నరసింహప్రసాద్ జోస్యం పలికారు. బుధవారం నర్సింగరాజపురం హరిజనవాడలో యూనిట్ ఇన్‌చార్జి కాకి శ్రీరామ్ బంధువుల శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ దఫా టీడీపీని గెలిపించుకోకపోతే తమ అభివృద్ధి నిరోధాన్ని తామే కొని తెచ్చుకున్నట్లేనని తెలిపారు. ఈ పాటికే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన పార్టీల సంయుక్త ప్రచారాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రతి సామాన్యుడికి తెలిసిపోయిందన్నారు. టీడీపీ, జనసేన బహిరంగ సభలకు వస్తున్న ఆదరణను చూసి వైసీపీ నాయకులకు కళ్లు మంటలెక్కుతున్నాయన్నారు. సీఎం జగన్ ఏపాటి నిజాయితీపరుడో స్వయానా ఆయన తోబుట్టువు షర్మిలమ్మే చెబుతున్న సత్యాలే నిదర్శనమన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నేరాలను ఎప్పుడూ ప్రోత్సహించరని, ధర్మమే వారి ఆయుధమన్నారు. ఇదిలా ఉండగా సీఎం జగన్ ప్రేరేపిస్తున్నట్లు వారు నేరాలను, అన్యాయాలను ఎప్పుడూ ప్రేరేపించరన్నారు. ఒక దళితుడిని నిర్ధాక్ష్యణంగా చంపి పార్శిల్ చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని జగన్ తన పక్కన పెట్టుకొని తిప్పుతున్నారని, అదే చంద్రబాబు అయితే నిందితుడిని తన దరికి కూడా రానివ్వడన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రాజంపేట పార్లమెంటు ముదిరాజ సంఘం అధ్యక్షుడు ఎన్.యానాదయ్య, టీడీపీ సాంకేతిక విభాగం సభ్యుడు ఏ.ధనుంజయనాయుడు, దళితనాయకులు, సోంబత్తిన సురేష్ బాబు, కాకి వెంకటరామయ్య ఉన్నారు.

రైతులు తప్పక సలహాలు పాటించాలి

సిద్దవటం, జనవరి 31: మండల పరిధిలోని జ్యోతి, పొన్నవోలు, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల పరిధిలోని మామిడి తోటలను బుధవారం బద్వేలు ఉద్యానఅధికారి జయభరత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన మామిడిలో పూత కొంత ఆలస్యంగా వస్తుందని, మామిడి రైతులు నిపుణుల సలహాల మేరకు పూతకు రాని తోటలలో మల్టీ-కే (13:00 45-10 గ్రాములు) జింక్ (1.5 గ్రాములు), బోరాన్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి ఖచ్చితంగా పిచికారీ చేయాలన్నారు. అలాగే పూత మొగ్గ దశలో ఉన్నప్పుడు ఏ విధంగా చేయాలని వివరించారు. తేనె మంచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చని, మామిడి రైతులు సలహాలు, సూచనల కొరకు సంబంధిత రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తథ్యం'


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

సుండుపల్లె, జనవరి 31: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తధ్యమని నియంతన పాలనకు ప్రజలే తగు గుణపాఠం చెబుతారని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం మండలంలోని వీ రెడ్డివారిపల్లె కోనంకివారిపల్లె, హరిజనవాడల్లో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి నిరోధక పాలనకు చరమగీతం పాడి ప్రజా పాలనకు స్వాగతం చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చింతల రామక్రిష్ణ, ఒంటేరు రాజా, సలీం సుంకర సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం

పెనగలూరు, జనవరి 31: నాలుగున్నరేళ్లుగా మండల పరిషత్ ఎంపీడీవోగా పనిచేసిన పి.వరప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా వెళుతుండగా బుధవారం ఆ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏవో పద్మభూషణ్‌రెడ్డి, ఈవోఆర్‌డీ బాలాకుమార్, సీహెచ్‌వో సురేంద్రనాథ్ రాజ్, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్, పీఆర్‌ఏఈ గంగులయ్య తదితరులు ఆయనకు శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా పద్మభూషణ్‌రెడ్డి

పెనగలూరు, జనవరి 31: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పద్మభూషణ్‌రెడ్డి బుధవారం నుంచి పెనగలూరు మండల ఇన్‌చార్జిగా నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రెగ్యులర్ ఎంపీడీవోను నియమించే వరకు తాను ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు.

యాంటినా విభాగాలపై అవగాహన

రాజంపేట, జనవరి 31: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఈసీఈ విభాగం విద్యార్థులకు బెంగుళూరు ప్రొఫెసర్ డాక్టర్ వివేకానంద ఆధ్వర్యంలో యాంటినా విభాగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, ఈఈసీ విభాగాధిపతి నాగరాజు, కో-ఆర్డినేటర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం - ఇరువురు అరెస్టు


అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఒంటిమిట్ట, జనవరి 31: మండల పరిధిలోని మౌలాతట్ దర్గా వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం రావడంతో ఎస్ఐ మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం సిబ్బందితో కలిసి దాడి చేసి ఇరువురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 151 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు రాచపల్లి గ్రామానికి చెందిన సుంకేసుల గంగాధర్, సుంకేసుల గంగయ్యలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుబ్బరాజు, సుబ్బారెడ్డి, సిబ్బంది నాగరాజు, మల్లి, శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం కమిటీ ప్రెసిడెంట్‌గా నిజాముద్దీన్

నందలూరు, జనవరి 31: మండలంలోని టంగుటూరు గ్రామంలో ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ముస్లిం కమిటీ ప్రెసిడెంట్‌గా సయ్యద్ నిజాముద్దీన్, సెక్రటరీగా షేక్ తాజుద్దీన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు బుధవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అన్నం నాగేంద్రమూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ సయ్యద్ జుల్ఫీకర్, సర్పంచ్ షేక్ మైనుద్దీన్, స్థానిక నాయకులు మహమ్మద్ గౌస్, షేక్ షాబురు, నాగభూషణం, రాంబాబు, తోషిద్, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నందలూరు, జనవరి 31: అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేనలను అత్యధిక మెజారిటీతో గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని జనసేన నాయకులు ఆకుల చలపతి, సింగంశెట్టి నరేంద్రలు పేర్కొన్నారు. బుధవారం టంగుటూరు పంచాయతీ శేషుగారిపల్లె, టి.వి.పురం, రాచపల్లె, మరాటపల్లి గ్రామాలలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మండలంలో ప్రతిపల్లెకు, ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్ భారతాల, బంగ్రోతు ఈశ్వరయ్య, భీమినేని రమేష్, పుట్ట కృష్ణ, పీవీఆర్ కుమార్, మునగ రామయ్య, మునగ యానాది, తిప్పాయపల్లి ప్రశాంత్, వెలకచర్ల హరిబాబు, మంటి వెంకటసుబ్బయ్య, బత్యాల వినయ్, పాలూరు మహేష్, పోకూరు మల్లికార్జున, పైడికొండ్ల సునీల్‌గౌడ్, నందు, తోట వెంకటసుబ్బయ్య, శ్రీను, బారతాల బాలాజీ, వర్ల కార్తీక్, ఆవుల చిన్నయ్య, రాజబోయిన తరుణ్, శ్రీనివాసుల పాల్గొన్నారు.

ముగ్గురాయిని చిన్న మిల్లులకు ఇవ్వాలి

● ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డికి వినతి

రైల్వేకోడూరు, జనవరి 31: కోటి టన్నుల సీ, డీ గ్రేడు ముగ్గురాయి టెండర్లను చిన్న పల్వరైజింగ్ మిల్లులకు ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిని మంగంపేట పల్వరైజింగ్ మిల్లుల యజమానులు, పల్వరైజింగ్ మిల్లుల అసోషియేషన్ నాయకులు మాచినేని విశ్వేశ్వరనాయుడు, గల్లా శ్రీనివాసులు, కల్లా చలపతి, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, రాజయ్య తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటి టన్నులకు సీ, డీ గ్రేడు ముగ్గురాయి టెండర్ వేస్తే చిన్న పల్వరైజింగ్ మిల్లుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. మంగంపేట ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందకుండా కుంటుపడుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని చిన్న పరిశ్రమలకు 50 శాతం ఇచ్చి న్యాయం చేయాలని ఎండీని కోరినట్లు తెలిపారు. అనంతరం పల్వరైజింగ్ మిల్లుల యజమానులు ఎండీ వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దీంతో ఎండీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

మొబైల్ వాహనంలో చాయ్ కౌంటర్ ఏర్పాటు

రాజంపేటటౌన్, జనవరి 31: రాజంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు హైస్కూల్ సమీపంలో గల మొబైల్ వాహనంలో బీజేపీ నేత నాగోతు రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో చాయ్‌కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ మైదానంలో నాలుగు రోజులుగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్న సందర్భంగా క్రీడాకారిణులకు, ఆటలను చూసేందుకు వచ్చే వారి కోసం వాహనం ద్వారా ఉచితంగా మోదీచాయ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అందరూ అండగా ఉండాలన్నారు. ప్రధాని చిన్నతనంలో ఒక చాయ్ వాలాగా పనిచేసి నేడు ప్రధానమంత్రిగా ఎదిగారన్నారు. ఆ గుర్తుగా ఈ మొబైల్ చాయ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణయాదవ్, గుణవర్మ, సునీతనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్ ఎస్ఐగా భక్తవత్సలం


బాధ్యతలు చేపట్టిన భక్తవత్సలం

రాయచోటిటౌన్, జనవరి 31: రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్-1 ఎస్ఐగా భక్తవత్సలం నియమితులయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో భాగంగా రాజంపేట మన్నూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి వచ్చారు. ఈయన గతంలో వీరబల్లి, సుండుపల్లె, రైల్వేకోడూరు మండలాల్లో పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ నరసింహారెడ్డి డీపీఓ ఆఫీసుకు బదిలీపై వెళ్లారు. కాగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంతో పాటు మండల పరిధిలో మట్కా, జూదం, అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ సుధాకర్‌రెడ్డి సహకారంతో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు.

టీడీపీతోనే సంక్షేమ ఫలాలు


కట్టావారిపల్లెలో ప్రచారం చేస్తున్న రేవతి

రైల్వేకోడూరు, జనవరి 31: టీడీపీతోనే పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని కట్టావారిపల్లె, అప్పా రా జు పేట, ఈట మాన్పురం, మరాటిపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలు అభివృద్ధి చెందక వెనకబడి ఉన్నాయన్నారు. అభివృద్ధి చేయాలంటే ఒక్క టీడీపీకే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేనేపల్లి చిన్నా, నగిరిపాటి సుబ్రహ్మణ్యం, మహేష్, గోపీ, కాశీ, శాంతి, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ


పేదలకు అల్పాహార విందును అందజేస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి 31: పొత్తపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్బిగారి రాజేంద్రప్రసాద్ తృతీయ వర్ధంతి సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు విద్య, పరీక్ష సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, అబ్బిగారి బాబు, వేణుగోపాల్ గ్రామ పెద్దలు వెంకటచలపతి నాయుడు, నారాయణరెడ్డి, నెల్లూరు రమణారెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఆర్.ఎస్.రోడ్డులోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహ సమీపంలో కుటుంబ సభ్యులు అబ్బిగారి బాబు, అబ్బిగారి వేణుగోపాల్ పేదలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రామణి యాదవ్, గురుప్రసాద్, మోడపోతుల రాము, విశ్రాంత ఉద్యోగులు, ఆంజనేయులు, శ్రీరామ్ హరినాధ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం వితరణ


దాతను సత్కరిస్తున్న మానవతా సభ్యులు

చిట్వేలి, జనవరి 31: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖకు శాంతిరథం కోసం నాలుగు చక్రాల వాహనాన్ని చిట్వేలి శాఖ ఉపాధ్యక్షుడు ఆకేపాటి వెంకటరెడ్డి బుధవారం వితరణగా అందించారు. ఈ మేరకు స్థానిక సాయివికాస్ పాఠశాలలో జరిగిన సమావేశంలో వెంకటరెడ్డి తల్లిదండ్రులు కీర్తిశేషులు ఆకేపాటి కృష్ణారెడ్డి, ధర్మపత్ని తిరుమలమ్మ జ్ఞాపకార్థంగా వాహనాన్ని వితరణగా సభ్యులకు అందించారు. అనంతరం దాత వెంకటరెడ్డిని సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, గౌరవ డైరెక్టర్ సభ్యులు ఉమామహేశ్వర్‌రెడ్డి, తిరుమల విశ్వనాధం, రంగారెడ్డి, వీరాంజనేయరాజు, శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తిరుమల రెడ్డయ్య, రోళ్ల మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల సమావేశం రసాభాస

● మండల కో-ఆప్షన్ సభ్యులు, ఎంఈవో వాగ్వివాదం

నందలూరు, జనవరి 31: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. ఎంఈఓ నాగయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలిముల్లా ఖాన్ మధ్య నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శిథిలావస్థలో ఉన్న గొల్లపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల సమస్యలపై వాగ్వివాదం జరిగింది. అనంతరం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జోక్యంతో సద్దుమణిగింది. అనంతరం మండలంలోని అధికారులతో అభివృద్ధి పనులపై చర్చ కొనసాగింది. ఈ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎంపీపీ మండిపడ్డారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఎంపీడీవో సౌభాగ్యమ్మను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గడికోట ఉషారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యలో రాణిస్తే ఉద్యోగావకాశాలు

- రాజంపేట ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్ అజయ్‌బాబు


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

రాజంపేట, జనవరి 31: ఉర్దూ విద్యలో రాణిస్తే విద్యార్థులకు భవిష్యత్తులో ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాజంపేట ప్రభుత్వ ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్ నందవరపు అజయ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాజంపేటలో మైనార్టీ విద్యార్థినుల కోసం ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కళాశాల విద్యారంగంలో ఎంతో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వార్షికోత్సవ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉర్దూ కళాశాల అధ్యాపకులు షాదిక్, జాఫర్ హుస్సేన్, ఫర్హానా పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రిమాండు

పుల్లంపేట, జనవరి 31: డ్రంకెన్ డ్రైవ్ కేసులో మండలంలోని రామక్కపల్లి గ్రామానికి చెందిన గండ్రో లక్ష్మీనారాయణకు బుధవారం నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత 10 రోజులు డిమాండ్ విధించినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా నిందితుడు మద్యం సేవించి వాహనం నడుపుతుండగా అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరచగా జడ్జి పది రోజులు రిమాండ్ విధించినటు తెలిపారు.

కొందరికే కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 31: నాలుగు లక్షల మంది కార్డుదారులకు ఈనెల కందిపప్పు పంపిణీకి కోతపడింది. జిల్లావ్యాప్తంగా 5.41లక్షల రేషన్ కార్డులు ఉండగా, వారికి కేజీ వంతున కందిపప్పు పంపిణీకి 541 టన్నుల కందిపప్పు అవసరం. కాగా ప్రభుత్వం జిల్లాకు 150 టన్నులు మాత్రమే కేటాయించగా, పౌరసరఫరాల సంస్థ యంత్రాంగం ఎం.ఎల్.పాయింట్ల ద్వారా డీలర్లకు పంపిణీ పూర్తిచేసింది. దీంతో 400 టన్నులు కందిపప్పు కోటాకు కోత పడడంతో కార్డుదారులకు ఈసారి అందే అవకాశం లేదు. దీనిపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా గురువారం నుంచి ఫిబ్రవరి నెల కోటా పంపిణీ ప్రారంభం కానుంది. ఇందుకోసం 150 టన్నుల గోధుమ పిండి, 250 టన్నుల రాగులు, అర కేజీ వంతున పంపిణీ కోసం 270 టన్నుల చక్కెర జిల్లాకు రాగా, వాటిని పౌరసరఫరాల సంస్థ డీలర్లకు అందజేసింది.

జేఈఈ మెయిన్స్‌కు 253 మంది

చిత్తూరు (సెంట్రల్), జనవరి 31: చిత్తూరులోని సీటమ్స్‌లో బుధవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 253 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 127 మంది.. మధ్యాహ్నం 128 మందికి గాను 126 మంది హాజరయ్యారన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీగా తహసీల్దార్ల బదిలీ

- రాత్రికే రిలీవింగ్ ఆర్డర్లు విడుదల
- నేడే కొత్తస్థానాల్లో చేరాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 31: ఉమ్మడి జిల్లా తహసీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ జాబితాలను రాష్ట్ర భూపరిపాలన శాఖ(సీసీఎల్ఏ)జోన్-4గా జాబితాసిద్ధం చేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన బదిలీలు కావడంతో సీసీఎల్ఏనే తహసీల్దార్లను జిల్లాలకు కేటాయించింది. దీనిప్రకారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు ఇస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న 67 మంది తహసీల్దార్లలో 16 మంది తప్ప మిగిలిన 51 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ 16 మందిలో 11 మంది జూన్ 30 నాటికి పదవీ విరమణకు దగ్గరలో ఉండగా.. జూన్ 30 నాటికి మూడేళ్ల తక్కువ సర్వీసు కలిగిన ఐదుగురు ఉన్నారు. దీంతో వీరికి మినహాయింపు ఇచ్చారు. అలాగే, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 22 మంది, కర్నూలు జిల్లా నుంచి 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా నుంచి 20 మంది చొప్పున 63 మంది తహసీల్దార్లను ఉమ్మడి జిల్లాకు బదిలీ చేస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారికి బుధవారం రాత్రే రిలీవింగ్ ఉత్తర్వులు సిద్ధం కాగా.. గురువారం తమకు కేటాయించిన జిల్లాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జిల్లా నుంచి కర్నూలుకు..

కలెక్టరేట్ ఏవో కులశేఖర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఆర్.వాసుదేవన్, ఎన్నికల సూపరింటెండెంట్ కె.బ్యూలా, ఎస్.మాధవరాజు (చౌడేపల్లె), వి.చంద్రశేఖర్ (సదుం), బి.పార్వతి (కుప్పం), ఎస్.ఎం.గురప్ప (గుడుపల్లె), ఐ.మురళీమోహన్ (చిత్తూరు), కె.బాబు రాజేంద్రప్రసాద్ (గుడిపాల), కె.బెన్నురాజ్ (బంగారుపాళ్యం), జి.జయప్రకాష్ (శ్రీరంగరాజపురం), కె.బాబు (పాలసముద్రం), జి.చంద్రశేఖర్ రెడ్డి (నగరి), పి.ఝాన్సీలక్ష్మి (శ్రీకాళహస్తి), ఎం.భార్గవి (బుచ్చినాయుడు కండ్రిగ), ఎం.ఉదయసంతోష్ (రేణిగుంట),సి.ఆర్.శేషయ్య(మదనపల్లె ఆర్డీవో కార్యాలయం), కె.నిర్మలాదేవి (అన్నమయ్య కలెక్టరేట్).

వైఎస్సార్ కడప జిల్లాకు..

నగరి ఆర్డీవో కార్యాలయ ఏవో పి.శివరామన్, కుప్పం ఆర్డీవో ఆఫీసు ఏవో ఎన్.ఎస్.కృష్ణకుమార్, అమర్‌నాథ్ (రొంపిచెర్ల), ఇ.అమర్‌నాథ్ (గంగవరం), ఆర్.ఇన్బనాధన్ (గంగాధరనెల్లూరు), ఎం.భగవతి (నింద్ర), ఐ.శేషగిరిరావు (పులిచెర్ల), కె.కుప్పయ్య (కలెక్టరేట్), పి.భారతి (తిరుపతి కలెక్టరేట్), వివిఎన్‌వీ ఆర్ కృష్ణ (డక్కిలి), ఎం.రోసయ్య (నాయుడుపేట), షేక్ జరీనా (సత్యవేడు), ఎస్.శివప్రసాద్ (ఏర్పేడు), యు.మధుసూదన్‌రావు (పిచ్చాటూరు), ఎస్.పరిమళ (నారాయణవనం), కె.వెంకటరమణ (తిరుపతి అర్బన్), ఎస్.శిరీష (చంద్రగిరి), కె.పి.భాగ్యలక్ష్మి (పాకాల), ఐ.సుబ్రహ్మణ్యం (వడమాలపేట), వై.రమేష్‌బాబు (తిరుపతి), ఆర్.వెంకటలక్ష్మమ్మ (తిరుపతి), ఎస్. మహేశ్వరిబాయి (సంబేపల్లి), కె.ధనుంజయులు (పీలేరు), ఎం.భీమేశ్వరరావు (కురబలకోట), సి.శ్రీనివాసులు (ములకలచెరువు), జె.రాము (పెద్దమండ్యం) బదిలీ అయ్యారు.

అనంతపురం జిల్లాకు..

టి.సీతారామ్ (పుంగనూరు), జి.కె.కుమారస్వామి (బైరెడ్డిపల్లి), వై.చిట్టిబాబు (వి.కోట), బి.హనుమంతు (యాదమరి), డి.రవికుమార్ (కార్వేటినగరం), డి.లక్ష్మీనారాయణ (వెదురుకుప్పం), ఎం.హనుమాన్ నాయక్ (బాలయ్యపల్లె), జె.నిత్యానంద బాబు (తొట్టంబేడు), సి.శ్రీదేవి (కేవీబీపురం), టి.వి.సుబ్రహ్మణ్యం (తిరుపతి రూరల్), జె.పరమేశ్వరస్వామి (పుత్తూరు), యు.దస్తగిరయ్య (ఎర్రావారిపాళ్యం), ఎం.లోకేశ్వరి (చిన్నగొట్టిగల్లు), సి.కె.శ్రీనివాసులు (తంబళ్ళపల్లి), జె.భాగ్యలత (కలిగిరి) ఉన్నారు.

ఆదిమూలం దెబ్బ

- గురుమూర్తి రీబ్యాక్
- రాజేష్‌కు సత్యవేడు ఛాన్సు


గురుమూర్తి


రాజేష్

తిరుపతి, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి): అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొట్టిన దెబ్బకు అధికార పార్టీ ఇంచార్జుల జాబితా తారుమారైంది. బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన ఐదవ జాబితాలో దాని ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జిగా స్థానిక ఎంపీ గురుమూర్తిని ప్రకటించిన అధిష్ఠానం సత్యవేదుకు నూకతోటి రాజేష్‌ను ఇంచార్జిగా నియమించింది. రాజేష్ మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సోదరి కుమారుడు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా తిరుపతి లోక్‌సభ స్థానానికి ఇంఛార్జిగా నియమిస్తూ గత 7వ తేదీన నాలుగో జాబితాలో అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోనే సత్యవేడు ఇంచార్జిగా తిరుపతి ఎంపీ గురుమూర్తిని ప్రకటించింది. ఆ జాబితా కారణంగా జిల్లా వైసీపీలో ముసలం పుట్టినట్టయింది.తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఇష్టపడని ఆదిమూలం ఆ విషయం అధినేతకు, మంత్రి పెద్దిరెడ్డికి పదేపదే చెప్పుకున్నా ఫలితం లేకపోయింది. నియోజకవర్గ వైసీపీలో వ్యతిరేక వర్గం ముందు తలెత్తుకోలేని పరిస్థితులు ఏర్పడడంతో ఎంపీ టికెట్ కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని భావించిన ఆదిమూలం ఎంపీ టికెట్ తనకు వద్దని, అంతకు మించి దళితులకు గౌరవం ఇవ్వని పార్టీయే తనకు అవసరం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఆయన టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. ఈ పరిణామాలతో వైసీపీ అధిష్ఠానం షాక్‌కు గురైంది. తాజా జాబితాలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ ఇంఛార్జిగా తప్పించి తిరిగి తిరుపతి లోక్‌సభకు ఇంచార్జిగా ప్రకటించారు. ఖాళీగా వున్న సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను నియమించారు. రాజేష్ మంత్రి పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు. జీడీనెల్లూరులో అవకాశం కల్పించాలని ఎంత ప్రయత్నించినా సమీకరణల కారణంగా వీలు కాలేదు. జీడీ నెల్లూరు నుంచీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని తప్పించి అక్కడ రాజేష్‌ను ఇంచార్జిగా నియమించాలన్న ప్రయత్నాలు బలంగా జరిగాయి. అయితే నారాయణస్వామి అధినేత ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో మనసు మార్చుకున్న అధినేత చిత్తూరులో ఎంపీ స్థానానికి ఇంచార్జిగా వేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను అనివార్యంగా జీడీనెల్లూరు అసెంబ్లీకి బదిలీ చేయాల్సి వచ్చింది. దీంతో రాజేష్‌కు అవకాశం కల్పించలేకపోయారు. అయితే ఆదిమూలం పార్టీని వీడడంతో అనూహ్యంగా రాజేష్‌కు అవకాశం దక్కింది. గెలుపోటముల సంగతి పక్కనపెడితే ఈ దఫా టికెట్ దక్కదని తీర్మానించుకున్న రాజేష్‌కు అదృష్టం తలుపు తట్టింది. మరోవైపు తిరుపతి నుంచీ సత్యవేడుకు, మళ్ళీ సత్యవేడు నుంచీ తిరుపతికి బంతిలా అటూఇటూ దొర్లిన గురుమూర్తి సైతం తీవ్ర ఆవేదనతో వున్నట్టు సమాచారం. మొత్తానికి కోనేటి ఆదిమూలం తీసుకున్న నిర్ణయం వైసీపీలో అనేక మార్పుచేర్పులకు కారణమవుతోంది.



చెవిరెడ్డికి వైసీపీలో మరిన్ని బాధ్యతలు

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి తాజాగా వైసీపీలో మరిన్ని అదనపు బాధ్యతలు మీద పడ్డాయి. ఇప్పటికే పార్టీ అనుబంధ విభాగాల ఇంచార్జిగా వ్యవహరిస్తున్న ఆయన కొంతకాలంగా పూర్తి సమయం పార్టీ అధినేత జగన్‌కు అందుబాటులో వుంటూ పార్టీ సర్వేల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనను ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామకంతో ఒంగోలు ఎంపీ టికెట్ ఆయనకే కేటాయించే అవకాశముందని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. అనూహ్య పరిణామాలు ఎదురైతే తప్ప ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ఆయనే బరిలోకి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

విశ్వేశ్వర ఆలయ భూమి విక్రయించేందుకు విఫలయత్నం



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూమి

పలమనేరు, జనవరి31 : పలమనేరు రాధా బంగ్లా ఏరియాలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామికి చెందిన కోట్ల విలువచేసే భూమిని అక్రమంగా విక్రయించేందుకు కొందరు విఫలయత్నం చేశారు. స్థానికులు ఈ విషయాన్ని ఎండోమెంట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా... పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి దశాబ్దాలక్రితం మునినారాయణ శెట్టి అనే వ్యక్తి 372-3 సర్వేనంబరులో ఉన్న 81 సెంట్ల భూమిని రిజిష్టర్ చేసి అప్పగించారు. ఆలయ కుమారుడు మృతి చెందడంతో వితంతువైన కోడలు వెంకటమ్మ పేరున రాస్తూ ఆమె ఆ భూమిని అనుభవించుకోవాలని, ఇతరులకు అన్యాక్రాంతం చేయకూడదని, వెంకటమ్మ మరణానంతరం కూడా ఆ భూమికాశీవిశ్వేశ్వరస్వామికి చెందాలన్న షరతులు పెట్టారు. అయితే వెంకటమ్మ ఆ భూమిని ఒకరికి విక్రయించడంతో ఆమె మరణానంతరం ఆ భూమిని స్వాధీనం చేసుకొనేందుకు ఆమె నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి రావడంతో ఎండోమెంట్ అధికారులు అడ్డుకొన్నారు. దీంతో అతను కోర్టును ఆశ్రయించారు. జిల్లాకోర్టులో కొన్నేళ్లక్రితం అతడికి అనుకూలంగా తీర్పువచ్చింది. అయితే ఎండోమెంట్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ భూమి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందుతుందని హైకోర్టు ఇటీవల తీర్పుఇచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న కొందరు ఈ భూమిని వెంటనే విక్రయించి సొమ్ముచేసుకోవాలని నిర్ణయించారు. దీంతో మంగళవారం ఆభూమిలో ఉన్న ముళ్లచెట్లను నరికించి ప్రొక్లయినర్ ద్వారా చదును చేసేందుకు ప్రయత్నించారు. ఈవిషయాన్ని స్థానికులు ఎండోమెంట్ అధికారలకు ఫిర్యాదు చేయడంతో వెంటనే వచ్చి ఈ భూమి ఆలయానికే చెందుతుందని హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పడంతో వారు గత్యంతరం లేక వెనుతిరిగారు.

సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి బదిలీ

చిత్తూరు, జనవరి 31: సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి బదిలీ అయ్యారు. ఈమెను కాకినాడ సెబ్ ఏఎస్పీగా బదిలీచేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు సెబ్ ఏఎస్పీగా ఎవరినీ నియమించలేదు.

తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి హల్‌చల్


రోడ్డుకు సమీపంలో ఎలుగుబంటి

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసి భక్తులను భయపెట్టింది. అలిపిరి సమీపంలోని మొద టి మలుపు వద్ద రోడ్డు సమీపానికి ఎలుగుబంటి రావడం యాత్రికులను భయభ్రాంతులకు గురిచేసింది. కొంతసమయం రోడ్డుకు దగ్గరదగ్గరగా ఎలుగుబంటి సంచరించింది. దాదాపు 20 నిమిషాల తర్వాత వాహనాల శబ్దాలను గమనించి ఎలుగుబంటి అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది.

క్రీడా మైదానాన్ని కాపాడండి

ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలను చెరపకండి - క్రీడాభిమానుల వేడుకోలు

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఎస్వీ హైస్కూల్‌కు చెందిన క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని పలువురు క్రీడాభిమానులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం రోడ్డులోని ఆటస్థలంలో టీటీడీ బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ బుధవారం మైదానానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి, వారిని లోపలకు వెళ్లనీయకుండా గేట్లు వేసేశారు. దీంతో గేటు బయటే నిరసనకు దిగారు. 'ప్లే గ్రౌండ్‌లో భవనాలు వద్దు-ఆటలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ నగరానికి ఒక ఐకాన్‌గా ఉండేదని, అలాంటి దాన్ని నాశనం చేయవద్దని కోరారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ డైనమస్ క్లబ్ ద్వారా ఎంతోమంది ఆటగాళ్లు ఇదే స్థలం నుంచి వచ్చారని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేశారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వేదికగా నిలిచిన క్రీడా ప్రాంగణాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చకుండా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గుంతలు తవ్వేసిన ఆట స్థలం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. పార్టీలకతీతంగా ఉద్యమిస్తామన్నారు. జెన్ కిరణ్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ కనుమరుగైపోతోందని ఆవేదన చెందుతున్నామన్నారు. నాటి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మునెయ్య, రెడ్డెప్ప, ఫిలిప్స్ మాట్లాడుతూ ఇక్కడ జరిగే ఆటల పోటీలను చూసేందుకు టికెట్లు కొనుగోలు చేసి వచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం క్రీడా మైదానం చూసినప్పుడల్లా మనసులో తెలియని బాధ కలుగుతోందన్నారు.

అడవి పందుల కోసం కరెంటు ఉచ్చు

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



గంగాధరం (ఫైల్ ఫొటో) - మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

సోమల, జనవరి 31: అడవి పందుల కోసం మామిడి తోటలో విద్యుత్ తీగలు లాగారు. ఈ కరెంటు తీగలకు తగిలి గంగాధరం మృతిచెందాడు. ఇతడికి మూడు నెలల కిందటే వివాహమైంది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమల మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా... ఆవులపల్లె పంచాయతీ దేవళకుప్పం వద్ద యానాదివాడకు చెందిన పలువురు మంగళ వారం తమ గొర్రెలతో అడవికి వెళ్లారు. సాయంత్రం మందలోని కొన్ని గొర్రెలు కనిపించలేదు. దీంతో తప్పిపోయిన గొర్రెల కోసం వెతకడానికి గంగాధరం (గణపతి), సిద్దప్ప, ఈశ్వరయ్య కలసి అడవి మార్గంలో వెళ్లారు. ఈ మార్గంలోని మామిడి తోట నుంచి అడవి పందుల కోసం విద్యుత్ తీగలు లాగారు. ఇది గమనించని యానాదులు చీకటిలో ఆ విద్యుత్తు తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యారు. వీరిలో గంగాధరం సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇతడిని కాపాడే ప్రయత్నంలో సిద్దప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గుర్తించిన ఈశ్వరయ్య ప్రమాదం నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డారు. యానాదివాడకు చేరుకుని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన సిద్దప్పకు పెద్దఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్సలు కల్పించి మెరుగైన వైద్యం కోసం సదుం వైద్యశాలకు తరలించారు.గంగాధరానికి మూడునెలలకిత్రం వివాహం జరిగింది. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ వెంకట నరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గంగాధరం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, రెండు కిలోమీటర్ల దూరం విద్యుత్ తీగలు తీసి ఉండటాన్ని అధికారులు గుర్తించారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి

మృతుడి కుటుంబానికి తోట యజమాని శేషాద్రి నాయుడు తదితరులు ఆర్థిక సాయం అందజేయాలని సదుం వైద్యశాల వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండు చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించి.. ఇలాంటి ఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు కోరారు. జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మంద రామనాధం, జిల్లా యువసేన మాజీ అధ్యక్షుడు మురళి, మండల శాఖ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

దేవదొడ్డిలో స్థలవివాదంపై ఉద్రిక్తత

టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం



బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌వద్ద గుమికూడిన జనం

బైరెడ్డిపల్లె, జనవరి 31 : మండలంలోని దేవదొడ్డి గ్రామంలో ఓ స్థలానికి సంబంధించి కొంతకాలంగా టీడీపీ నాయకుడు అమీర్‌కు, వైసీపీ నాయకుల మధ్య వివాదం జరుగుతోంది. బుధవారం సంబంధిత స్థలంలో వైసీపీ వారు కట్టడం పనులు చేపడుతున్నారని, నిలుపుదల చేసి తనకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు అమీర్ దేవదొడ్డి వద్ద ఆందోళనకు పూనుకోవడంతో పోలీసులు వచ్చి దీన్ని అడ్డుకున్నారు. ఆ స్థలం తమకే చెందుతుందని ఇరువర్గాల వారు పోలీసుల ఎదుట వాదోపవాదాలకు దిగారు. ఆ సమయంలో కొందరు వైసీపీ శ్రేణులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా టీడీపీ నాయకుడు అమీర్‌ను పోలీసులు పోలీసు స్టేషన్‌కు తరలించడంతో పలువురు టీడీపీ శ్రేణులు, దేవదొడ్డి గ్రామస్తులు బైరెడ్డిపల్లె పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పోలీసులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

..ఇక, సెలవు నాన్న

- మిమ్మల్ని మధ్యలో వదిలి వెళుతున్నా క్షమించండి
- ఉద్యోగం కోసం డబ్బుకట్టి మోస పోయానంటూ యువకుడి ఆత్మహత్య


వసంత్ కుమార్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

సదుం, జనవరి 31: 'అమ్మా నాన్నా నన్ను క్షమించండి. ఇలా మధ్యలో వదిలి వెళుతున్నందుకు నాకు బాధగా ఉంది. నాన్న, నేను లేనని నువ్వు బాధ పడకు. అక్కావాళ్లు నిన్ను బాగా చూసుకుంటారు. నీ ఆరోగ్యం జాగ్రత్త. అమ్మను జాగ్రత్తగా చూసుకో' అంటూ సూసైడ్ నోట్ రాసి .. వసంతకుమార్‌రెడ్డి (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం సదుం మండలం పాలమంద పంచాయతీ చెరవుముందరపల్లెలో వెలుగు చూసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ఒంగోలుకు చెందిన కిరణ్‌కు డబ్బు కట్టడంతో సమస్య మొదలైనట్లు తెలుస్తోంది. తన తండ్రి రామిరెడ్డిని ఉద్దేశించి సూసైడ్ నోట్ రాశారు. ఆ వివరాలిలా.. 'ఉద్యోగం కోసం మీ దగ్గర డబ్బులు తీసుకుని నా స్నేహితుడు అయిన కిరణ్‌ను నమ్మి డబ్బు కట్టా. నా పూచీ మీద మరో ఇద్దరు స్నేహితులం కలిపి రూ.10.33 లక్షలు ఇచ్చాం. తర్వాత తెలిసింది అది ఫ్రాడ్ కంపెనీ అని. కిరణ్‌ని చాలాసార్లు డబ్బు అడిగా.. ఇస్తా ఇస్తా అని చెబుతూనే ఉన్నాడు. ఇంతలో నా తరఫున డబ్బు కట్టిన ఓ స్నేహితుడు ఆత్మహత్యకు యత్నించాడు. నా వల్ల నువ్వు వారి వద్ద మాట పడాల్సి వచ్చింది. నన్ను క్షమించండి. కిరణ్‌కు ఎన్నిసార్లు ఫోను చేసినా సమాధానం లేదు. ఇవాళ, రేపు వస్తుందని అంటున్నాడు. ఈ ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నా' అంటూ నోట్‌లో రాశారు. కిరణ్ అందుబాటులో లేకుండా పోవడం.. మిగతా మిత్రులు డబ్బు కోసం ఒత్తిడి తేవడంతో ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి తమ ఇంటి మిద్దెపైనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పైకి వెళ్లి చూసి విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి కన్నీరుమున్నీరయ్యారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మారుతి పరిశీలించారు. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని.. గ్రామంలో విచారించారు. తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు ఆపాలి



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్) జనవరి 31 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వినాశకరమైన విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలపై అధిక భారం మోపుతోందని, వీటిని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మూడోరోజు బుధవారం తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. హాజరైన మురళి మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు రూ.1,387కోట్లు ఆదాయ లోటును చూపాయన్నారు. ఆ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పకుండా దొడ్డిదారిన వినియోగదారులపై భారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని నియంత్రణ మండలి అనుమతించకూడదని కోరారు. గతంలోనూ ఇలా ఆర్థిక లోటు పూడ్చేందుకు ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. డిస్కంలకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్లను బకాయి పెట్టడం వల్ల అధిక వడ్డీకి రుణాలు తీసుకుని సంక్షోభంలో కూరుకుపోయాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి వేలకోట్ల రూపాయలు అదానీ గ్రూప్, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సహా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టపెట్టేందుకు రంగం సిద్ధమైందని, దీన్ని రెగ్యులేటరీ కమిషన్ అడ్డుకోవాలని కోరారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చట్టరీత్యా నేరమన్నారు. 2004 నుంచి 2019 వరకు వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సుమారు రూ.56,735కోట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేయడం ఏమిటని మండిపడ్డారు. అలాగే ప్రతినెలా ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ఇందనపు చార్జీలు, అడిషనల్ లోడ్ చార్జీల రూపంలో భారం వేయడాన్ని కమిషన్ అనుమతించకూడదన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ (టెక్నికల్) శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అమరరాజా సంస్థ నుంచి డీజీఎం కే.కుమారస్వామి ఆన్‌లైన్‌లో హాజరై మాట్లాడుతూ సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కేప్టివ్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా, వినియోగం తదితర అంశాలలో సాంకేతికపరంగా చార్జీలు నిర్ణయించే ఒప్పందాలను కమిషన్ మరోసారి పరిశీలించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, MANDAPALLI VENKATA SUBBAMMA (Old Name) R/o: 2/54-B, S T Colony, POLI, RAJAMPETA, ANNAMAYYA Dt, A.P. Do here by declired I have changed my Surname as MADANAPALLI VENKATA SUBBAMMA (New Name) W/o Madanapalli Venkatasubbaiah

AJT-6047

CHANGE OF NAME

I, MANDAPALLI GANESH (Old Name) R/o: 2/54B, POLI, RAJAMPETA, ANNAMAYYA Dt. A.P. Do here by declired I have changed my Surname as MADANAPALLI GANESH (New Name) S/o Madanapalli Venkatasubbaiah

AJT-6044

CHANGE OF NAME

I, Akula Nagaraja S/o. Akula Paradasi, D.No: 11-148/3A, Muttu Nagar, Tiruchanur, Tirupati Rural, Tirupati Dist., A.P.,-517503. Declare that I have changed my daughter name from Yerrabala Keerthana to AKULA KEERTHANA, DOB.25-02-2007,D/o Akula Nagaraja & M/o Akula Sobharani

AJT-6048

CHANGE OF NAME

I MANDAPALLI VENKATA SUBBAIAH (Old Name) R/o 2/54B, POLI, POLI S T Colony, RAJAMPETA, ANNAMAYYA Dt, A.P. Do here By declired I have changed my Surname as MADANAPALLI VENKATA SUBBAIAH (New Name) S/o Madanapalli Venkataiah.

AJT-6046

CHANGE OF NAME

I, Akula Nagaraja S/o. Akula Paradasi, D.No: 11-148/3A, Muttu Nagar, Tiruchanur, Tirupati Rural, Tirupati Dist., A.P.,-517503. Declare that I have changed my son name from Yerrabala Nitheesh to AKULA NITHEESH, DOB.23-09-2009 S/o Akula Nagaraja & M/o Akula Sobharani

AJT-6049

WANTED

తిరుపతి, కొర్లగుంటలోని టైలరింగ్ కంపెనీలో పనిచేయుటకు మరియు ప్యాకింగ్ కోసం మహిళలు కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించండి: Cell:92469 91550

AJT:2280

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించు 7382114647

AJA- 150700

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

బీసీలకు జగన్ రెడ్డి వెన్నుపోటు

● జయహో బీసీ సభల్లో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, శంకర్ యాదవ్

● భారీగా తరలివచ్చిన ప్రజలు

నిమ్మనపల్లి, జనవరి 31: బీసీలను వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని మదనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బస్టాండు వద్ద రాజంపేట టీడీపీ బీసీ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మన్న, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో 74 మంది బీసీలను చంపిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు. బీసీ సబ్‌ప్లాన్ కింద రావాల్సిన 75,760 కోట్లను దారి మళ్లించడంతోపాటు, 43 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24కు తగ్గించారన్నారు. రాష్ట్రంలో 14 లక్షల ఎకరాలు జగన్ దోచుకొంటే, అందులో ఎక్కువ శాతం బీసీల భూములే ఎక్కువగా ఉన్నాయన్నారు.. నామినేటెడ్ పదవులు కేవలం రెడ్డి సామాజిక వర్గానికే కట్టబెట్టాడని తెలిపారు. బీసీ సంక్షేమ పథకాలన్నింటిని రద్దు చేశాడని ఆరోపించారు. దాదాపు 56 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి బీసీలను ఉత్సవ విగ్రహాలను చేశాడన్నారు. ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేని జగన్ ప్రజలను ఓట్లు ఎలా అడుగుతాడని ఎద్దేవా చేశారు. ఇలాంటి ముఖ్యమంత్రిని వెంటనే ఇంటికి పంపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. యశస్విరాజ్, చాణుక్యతేజ్, రెడ్డెప్పరెడ్డి, మల్లికార్జున, ఆర్టే వెంకటేష్, మునిరత్నం, సురేంద్ర యాదవ్. రెడ్డెప్ప విజయ్, సూర్యప్రకాష్, మల్లప్ప, శ్రీనివాసులు, చంద్ర, నరేంద్ర పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : రాబోవు ఎన్నికల్లో ఆదరించండి రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని టి.సదుంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా దోచుకున్నారని మండిపడ్డారు. పాపాఘ్ని నదిలో ఉన్న వందల కోట్ల విలువ చేసే ఇసుకను దోచేశారని, నియోజకవర్గంలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను కాజేశారని దుయ్యబట్టారు. మళ్లీ పెద్దిరెడ్డి కుటుంబాన్ని గెలిపిస్తే గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికల్లో తిరిగి పుంగనూరుకు పంపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామని సవాల్ విసిరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. జనసేన కోఆర్డినేటర్ సాయినాథ్, మొలకల చెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ పోల్ కోఆర్డినేటర్ కుదుం శ్రీనివాసులు, టి.సదుం సర్పంచ్ శారదమ్మ, రాష్ట్ర వడ్డెర సాధికార సభ్యుడు పల్లపు నాగార్జున, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కనకంటి ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, పీటీఎం క్లస్టర్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, టీడీపీ నాయకులు బయ్యారెడ్డి, శివానంద, ఈవీ. రమణ, పక్రుద్దీన్ మస్తాన్, వినోద్‌తో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్



పెద్దతిప్పసముద్రం: సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శంకర్‌యాదవ్

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జనవరి 31: భర్తతో గొడవ పడి ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీకి చెందిన విద్యావాణి(36) భర్త సోమశేఖర్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. చంద్రశేఖర్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు వుండగా, విద్యావాణికి ఒక కొడుకు వున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం విద్యావాణి తన భర్త చంద్రశేఖర్‌తో గొడవ పడింది. పిల్లలు తాము ఒకే ఇంట్లో ఉండలేమని, మిద్దెపైన ఇంకో గది నిర్మించాలని వాగ్వాదం చేసింది. దీనికి సమ్మతించని చంద్రశేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆగ్రహించిన విద్యావాణి ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు చంద్రశేఖర్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి ఉరి నుంచి విద్యావాణిని తప్పించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందిందని చెప్పారు. తాలూకా ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టండి

● అధికారులకు టీడీపీ నేతల వినతి

వాల్మీకిపురం, జనవరి 31: వాల్మీకిపురం మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులకు కనబడటం లేదా అని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఎస్ఐ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మాధవరంపల్లె, మేడికుర్తి రిజర్వాయర్ ప్రాంతాలలో రాత్రి సమయాలలో ఇసుక దళారుల ఆగడాలు శృతి మించి పోయాయని ఆరోపించారు. రాత్రి వేళల్లో రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు పాల్పడటమే కాకుండా ప్రతిరోజూ సాయంత్రం నుంచి ఉదయం 5 గంటల దాకా వందలాది టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారు లు మాత్రం అధికార పార్టీ తొత్తులుగా మారుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల ప్రాంతంలో నీటిపారుదల శాఖ ఉత్తర్వులను కూడా లెక్క లేయడం లేదన్నారు. మండలంలోని కూరపర్తి గ్రామం మొదలుకుని కలికిరి మండలం మహల్ వరకు నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుక అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చోద్యం చూడటం తప్ప చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, వల్లిగట్ల రమణ, మురళి,డిష్ బ్రదర్స్, కువైట్ సయ్యద్‌బాషా, తెలుగు యువత చాను, వెంకటరమణ, ఆనంద్, కేకే నాయుడు,హనీఫ్, సైదు, గాంధీపేట రెడ్డి, స్వర్ణలత, జావీద్, నరష్, గంగులప్ప, రెడ్డెప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కురబలకోట, జనవరి 31: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మదనపల్లె పట్ట ణం మోతీనగర్‌కు చెందిన మోహన్(20), ముని రత్నం(20) ద్విచక్రవాహనంపై వెళుతుండగా కురబల కోట మండలం గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కారు ఢీకొంది. దీంతో. గాయపడినవారిని 108 వాహనం లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముది వేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రంకొండ ఎస్ఐ బదిలీ

గుర్రంకొండ, జనవరి 31: గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్‌ను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ దిలీప్‌కుమార్‌ను పీలేరుకు బదిలీ చేశారు. అలాగే గుర్రంకొండ ఎస్ఐగా తిరుపతి జిల్లాలో పని చేసే నాగార్జున్ రెడ్డిని నియమించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎస్ఐ దిలీప్‌కుమార్ బుధవారం రిలీవ్ అయ్యారు.

ఎస్ఐ తిప్పేస్వామి బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు, జనవరి 31: ములకలచెరువు ఎస్ఐ గా తిప్పేస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న గాయత్రిని జిల్లా కేంద్రానికి బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కలకడ ఎస్ఐగా పనిచేస్తున్న తిప్పేస్వామిని ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

మదనపల్లె అర్బన్, జనవరి 31: కందూరు మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం ఏర్పాటు చేసి గిఫ్ట్‌స్కీంకు సంబంధించి బుధవారం టూడిపో ఆవరణలో ఆడిపో మేనేజరు నిరంజన్ డ్రా తీశారు. డ్రాలో గెలుపొందిన బి, మమత, కె. నరసింహులు, వి, హేమకుమారికి బహుమతులను అమ్మ హాస్పిటల్ డాక్టర్ ఎంసీ సందీప్ స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు గీతా, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీస్తున్న ఆర్టీసీ అధికారులు

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తులు

బి.కొత్తకోట జనవరి 31 : తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి దరఖాస్తు చేశారు. బుధవారం విజయవాడలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలో తన బయోడేటాతో కూడిన దరఖాస్తును సమర్పించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయదలచిన ఆశావహులు, తమ దరఖాస్తులను పరిశీలన నిమిత్తం సమర్పించాలని పార్టీ హైకమాండ్ కోరింది. ఈ నేపథ్యంలో తన పేరును పరిశీలించాల్సిందిగా ఎంఎస్. చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర నాయకుడు తులసిరెడ్డితో కలసి దరఖాస్తును సమర్పించారు. 2014- 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈయన కాంగ్రెస్ అభ్యర్థిగా రెండు సార్లు వరుసగా పోటీ చేశారు. మూడో సారి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

మదనపల్లె అర్బన్ : మదనపల్లె నియోజకవర్గ నాయకుడు ఎస్ రెడ్డీ సాహెబ్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల శ్రీధర్ బుధవారం విజయవాడలోని ఏపీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం తమ దరఖాస్తులు అందజేశారు.



దహనక్రియలు

మంచి మనిషి, మా అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం, కీ॥శే॥ పెరవలి ప్రమీలమ్మ గారు 31.01.2024 ఉదయం స్వర్గస్తులైనారు. తదుపరి వీరి అంత్యక్రియలు 01.02.2024 గురువారము ఉ॥ 9.30 గం॥లకు మదనపల్లె టౌన్, సుభాష్ రోడ్డులోని మా స్వగృహం నుండి బయలుదేరి పుంగనూరు రోడ్డు ఆదిత్య కాలేజీ ఎదురుగా మా వ్యవసాయ క్షేత్రం నందు అంత్యక్రియలు జరుగును

కీ॥శే॥ పెరవలి ప్రమీలమ్మ గారు

భర్త లేట్ పి.వి.గోపాల్ నాయుడు (మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్), మదనపల్లె

ఇట్లు... కుటుంబ సభ్యులు

పొజిషన్ సర్టిఫికెట్ల అక్రమాలపై విచారణ చేయండి

బి.కొత్తకోట జనవరి 31 : బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఇటీవల జారీ చేసిన ఇంటి పట్టాల పొజిషన్ సర్టిఫికెట్లలో అక్రమాలు జరిగాయని దీనిపై విచారణ చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సీపీఐ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఏఐటీయుసీ అధ్యక్షుడు సలీంబాషా బుధ వారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెయింటర్స్ కాలనీ, మోడల్ స్కూల్ పరిసరాల్లో రెవెన్యూ అధికారులు చేసిన అక్రమాలపై ఎన్ని సార్లు. ధర్నాలు చేసినా స్పందన లేదన్నారు. కొందరికి ఇప్పటికే పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, మరి కొంత మందికి ఇచ్చేందుకు సిద్దపడ్డారని ఆరోపించారు. వీరి వెంట ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.



జేసీ ఫర్మన్ అహ్మద్ ఖాన్ కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

గద్దర్ స్వప్నం సమానత్వం



గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న వీసీకే పార్టీ, బాస్ ప్రతినిధులు

మదనపల్లె, జనవరి 31: ప్రజా యుద్ధనౌక గద్దర్ స్వ ప్నం సమానత్వం అని ప్రజా కవి పోతబోలు రెడ్డప్ప, వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ అన్నారు. బుధవారంస్థానిక ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాకవి పోతబోలు రెడ్డప్ప మాట్లాడు తూ.. అసమానతలపై యుద్ధానికి సాయుధ దళమై సాంస్కృతిక గళమై సమరశంఖం పూరించిన గొప్ప విప్లవ యోధుడు గద్దర్ అని కొనియాడారు. పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ..ప్రజల పాటకు కొత్త ఒరవడిని అందించి, దానికి శ్రమ సౌందర్యాన్ని అద్ది, విముక్తి పోరాటానికి వీరులను అందించిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ అన్నా రు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు మునివెంకటప్ప, ఉత్తన్న, అంజప్ప, వీసీకే, బాస్ నాయకులు పాల్గొన్నారు.

198మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కురబలకోట, జనవరి 31: తమ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 198 మంది విద్యార్థులు ఎంపికైనట్లు విశ్వం డిగ్రీ కళాశాల ప్రినిపాల్ రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాతపరీక్ష, గ్రూప్ డిష్కషన్, హెచ్‌ఆర్ తదితర రౌండ్లను నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో 423 మంది పాల్గొనగా. 198మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ యం.ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర, హరికృష్ణ, వెంకటేష్, రేవతి తదితరులు అభినందించారు.

మైనార్టీ నేతకు శ్రీరాం చినబాబు పరామర్శ

బి.కొత్తకోట జనవరి 31 : జయహో బీసీ సభకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన బి.కొత్తకోటకు చెందిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎండి. మస్తాన్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. పార్టీ అన్నీ విదాలా ఆయన కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

నేరేడు కొండ్రాయ స్వామికి పూజలు

తంబళ్లపల్లె, జనవరి 31: మండలంలోని జుంజురపెంట లో వెలసిన నేరేడు కొండ్రాయ స్వామికి బుధవారం గ్రామస్తులు పూజలు నిర్వహించారు.ఉదయం నుంచి స్వామి వారికి ధూప దీప నైవేద్యాలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. జుంజురపెంటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాయకర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

కురబలకోట, జనవరి 31:మేనేజ్‌మెంట్ విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ సూచించారు. బుధవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు భారత ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన ఉత్పత్తి వినియోగ విధానాలు అనే అంశంపై ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధి, ఎగుమతులు, దిగుమతులు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాలపై ఆధారపడి ఉంటుందన్నారు. గత 30 ఏళ్ళలో ఆర్థికాభివృద్ధి లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంతో పాటుగా మధ్య ఆదాయ స్థితికి చేరుకునే దేశాల సంఖ్య విస్తరించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సహజ వనరుల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క అంచనా రేటు వృద్ధి రేటుని గ్రహించినట్లయితే మరింత వేగవంతం అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి తమలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి గీతా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

రాష్ట్ర స్థాయి తాడాటలో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, జనవరి 31: రాష్ట్రస్థాయి తాడాట పోటీల్లో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు బంగారు, ఐదు కాంస్య, ఐదు రజత పతకాలను సా ధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం జడ్పీ పాఠశాల ఆవరణలో ఆయా క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం సుబ్బా రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, దేవకమ్మ, జలజా, విద్యార్థులు పాల్గొన్నారు

నాటు తుపాకీతో దంపతులపై దాడి

కురబలకోట, జనవరి 31: పొలం విషయంలో తగాదా నేపథ్యంలో ఓ వ్యక్తి నాటు తుపాకీతో దాడి చేయడంతో దంపతులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు క్రాస్ పంచాయతీ దిన్నిమీదపల్లెకు చెందిన జి.రెడ్డిశేఖర్‌రెడ్డి(55), సరస్వతమ్మ(50) దంపతులు గ్రామ సమీపంలోని పొలంలో వ్యవసాయం చేస్తున్నారు. వీరి పొలం పక్కనే కాగా బద్దిపల్లెకు చెందిన మల్లికార్జున రెడ్డి అలియాస్ మల్‌రెడ్డి పొలంఉంది. కాగా, పంట విషయమై బుధవారం రాత్రి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జున రెడ్డి తన వద్ద నున్న నాటు తుపాకీతో దాడి చేసి వారిని గాయపరిచాడు. కుటుంబసభ్యులు క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నారు. ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో గాయపడిన సరస్వతమ్మ, రెడ్డిశేఖర్‌రెడ్డి

పీజీటీలకు ఇంక్రిమెంటు ఇవ్వాలి

● డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్

బద్వేలు టౌన్, జనవరి 31 : 2023- 24 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంతో 294 ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్‌గా మార్చి చేసి ఇంటర్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని హైస్కూలు ప్లస్ పిజీటీలకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పీఆర్‌టియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

మదనపల్లె టౌన్, జనవరి 31: బాలల హక్కులపై చిన్నారులకు అవగాహన కల్పించాలని న్యాయవాదులు బాలజ్యోతి, మీనాకుమారి సూచించారు. బుధవారం స్థానిక దేవతానగర్‌లోని చైతన్య సర్వీసెస్ అనాథాశ్రమంలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వీధి బాలల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ గతంలో లాగా ఎక్కడ కూడా వీధి బాలలు ఉండరాదని, అనాథాశ్రమాలు, ప్రభుత్వం కల్పించిన షెల్టర్లలో ఆశ్రయం పొందాల న్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ కృష్ణమూర్తి, ఆశ్రమ నిర్వాహకులు ఎంపీ ఆనందన్, కవితారాణి, ఉపాధ్యాయులు గిరిజమ్మాల్, జనార్దన్‌రెడ్డి, శంకర్,మధు, గులాబ్‌జాన్, చిన్నారులు పాల్గొన్నారు.



బాలల హక్కులను వివరిస్తున్న న్యాయవాది బాలజ్యోతి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కలకడ, జనవరి 31: తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఎర్రకోటపల్లె పంచాయతీ ఎల్లంకి వారిపల్లె మహిళలు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా గ్రామంలో నీటి సమస్య ఉందన్నారు. దీంతో తాగు నీటి కోసం వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్నట్లు వాపోయారు. అనంతరం ఈవోఆర్డీ లతీప్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని ఈవోఆర్డీ హామీ ఇచ్చారు.



ఈవోఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేదాం

కలకడ, జనవరి 31: అందరం కలిసి కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చే ద్దామని ఎర్రకోటపల్లె ఆసుపత్రి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పీహెచ్ సీ పరిధిలోని వ ఒడి య౦౦వారి పల్లెలో వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏడాదికి రెండు సార్లు కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే నిర్వహిస్తామన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, కంటి చూపు మందగించడం వంటి లక్షణాలతో వ్యాధిని నిర్ధారిస్తామన్నారు. బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రులో ఏడాదికి సరిపడా మందులను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.



గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు

. జడ్జిగా ఎంపికైన ప్రశాంత్‌కు సన్మానం

పీలేరు, జనవరి 31: ఇటీవల రాష్ట్ర హైకోర్టుకు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పల్లెపాగు ప్రశాంత్‌ను బుధవారం పీలేరులోని దళిత, బీసీ సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 'బాస్' నేత పాలకుంట శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉమాపతి మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి ఉన్నత చదువులు అభ్యసించి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడం ఆదర్శప్రాయమన్నారు. ప్రశాంత్ భవిష్యత్తులో మరిన్ని రాజ్యాం గ పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'బాస్' నాయకులు పాలకుంట చౌడప్ప, యువరాజ్, సుబ్బు, గణేశ్, జగదీశ్, బీసీ నాయకులు శివశంకర్, యోగి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న దళిత, బీసీ నేతలు

ఈఆర్‌వో గోపాలకృష్ణకు ఘనసన్మానం

పీలేరు, జనవరి 31: పదవీ విరమణ పొందిన పీలేరు నియోజకవర్గ ఈఆర్‌వో గోపాల కృష్ణను బుధవారం పీలేరులో సన్మానించారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ జేసీ రామ్మూర్తి మాటాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో గోపాలకృష్ణ చిన్న మచ్చ కూడా లేకుండా పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. పీలేరు నియోజకవర్గంలోని తహసీల్దార్లు మాట్లాడుతూ ఈఆర్‌వోగా గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించిన తరువాతనే ఓటరు జాబితా తయారీ పనులు వేగం పుంజుకున్నాయని, ఆయన పర్యవేక్షణలో ఎటువంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జామితా తయారైందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డా.మురళీ మోహన్ రెడ్డి, తహసీల్దార్లు ఖాజా బీ, ఫిరోజ్ ఖాన్, ప్రదీప్, నరసింహులు, భాగ్యలత, ఏఎస్‌వో రామ్మోహన్, హెచ్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈఆర్‌వో గోపాలకృష్ణను సన్మానిస్తున్న ఎంపీడీవో, తదితరులు

నిమ్మనపల్లి తహసీల్దార్ పదవీ విరమణ

నిమ్మనపల్లి, జనవరి 31: నిమ్మనపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన సీఆర్ మంజుల బుధవారం పదవీ విరమణ చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేయాల్సిన మంజుల ప్రభుత్వ గడువు పెంచడంతో రెండేళ్ల పాటు విధులు నిర్వర్తించారన్నారు. బుధవారంతో ఆమె గడువు తీరడంతో పదవీ విరమణ చేసినట్లు తెలిపారు. కాగా నూతన తహసీల్దార్ వచ్చే వరకు ఇక్కడే పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ తయస్విని ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు.



తహసీల్దారుకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

వైద్య సేవలు మరువలేనివి

తంబళ్లపల్లె, జనవరి 31: తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వో సు మతి, అప్తల్మాలజిస్ట్ రెడ్డప్ప రెడ్డి అందించిన వైద్య సేవలు మరువలేనివని డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం కోసువారిపల్లె పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌వో, అప్తల్మాలజిస్ట్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది, స్థానికులు ఇరువురిని పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి వారు అందిం చిన సేవలను కొనియాడారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌వో సుమతిని సన్మానిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నిస్వార్థ నాయకుడు బూర్లపల్లె కృష్ణారెడ్డి

పెద్దతిప్పసముద్రం జనవరి 31 : ఓ మంచి నాయకుడిని కోల్పోయామని పలువురు కొనియాడారు. మండలంలో జడ్పీటీసీ సభ్యుడిగా, మొలకలచెరువు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భావి తరాల వారికి ఆదర్శంగా నిలిచాడంటూ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే ఏవీ. లక్ష్మీదేవమ్మ, టీడీపీ నాయకులు గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామి నాయుడు, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గురప్పనాయుడు, తంబళ్ల ఎల్లె టీడీపీ ఇంచార్జ్ శంకర్‌యాదవ్, తంబళ్లపల్లె టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి లతో పాటు పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



బూర్లపల్లె కృష్ణారెడ్డి కుమారుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ, శ్రీరాం చినబాబు